ప్రజాశక్తి

ఆదివారం 14 జులై 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

మీ విధానం కూడా అదేనా !

- జిపిఎస్ అమలుకే కూటమి ప్రభుత్వం మొగ్గు చూపడంపై ఉపాధ్యాయులు భగ్గు

గెజిట్ నోటిఫికేషన్ ప్రతులను దగ్ధం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'పాత సీసాలో కొత్త సారా' అన్న విధంగా రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం జగన్ సర్కారు గతంలో తెచ్చిన జిపిఎస్ అమలుకే జై కొట్టడంపై ఉపాధ్యాయులు భగ్గుమంటున్నారు. ఈ నెల 12న జిపిఎస్ అమలు చేస్తూ జారీచేసిన గెజిట్ నోటిఫికేషన్‌పై విశాఖ జిల్లాలో ఉద్యోగ, ఉపాధ్యాయులంతా యూనియన్‌లతో నిమిత్తం లేకుండా మండిపడుతున్నారు. పైగా తాజా ప్రభుత్వం వెనక తేదీతో జిపిఎస్ అమలు చేస్తూ రాజపత్రాన్ని విడుదల చేయడం చూస్తే ఈ ప్రభుత్వ విధానం కూడా 'పాత సీసాలో కొత్త సారా' మాదిరే అన్న చర్చ అంతటా వినిపిస్తోంది. ఇప్పటికే అమ్మకు వందనం పథకంపై చర్చ నడుస్తోంది. ఎంతమంది పిల్లలనైనా కనండి అందరికీ అమ్మకు వందనం వర్తింపజేస్తామని ఎన్నికల ముందు చెప్పిన చంద్రబాబు తీరా అధికారంలోకి వచ్చాక షరతులను అమలు చేస్తూ ఒక్కరికే కుదించడం పలువురిని ఆగ్రహానికి గురిచేస్తోంది. ఒపిఎస్ విషయంలో గతంలో జనసేన అధినేత పవన్ కల్యాన్ ఒక వీడియో విడుదల చేస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయుల డిమాండ్స్‌ను పరిగణలోకి తీసుకుంటామని, జగన్ ప్రభుత్వంలాగ నిరంకుశంగా వెళ్లబోమని వెల్లడించారు. ఒకవేళ అమలు కాకపోతే తానే వారి గొంతుకై ప్రశ్నిస్తానని కూడా చెప్పారు. దీంతో తాజాగా ఉపాధ్యాయ, ఉద్యోగులంతా 'పవన్ ఎక్కడున్నారు? ప్రశ్నించరా ? అంటూ పాఠశాలల్లో గుసగుసలాడుకోవడం కనిపిస్తోంది. గత ప్రభుత్వం విధానాన్నే అమలు చేయాలని కూటమి పాలకులు చూడడం దారుణమంటూ ఆగ్రహం వ్యక్తపరుస్తున్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేసినట్లు ప్రకటించిన ప్రభుత్వం రాష్ట్రంలో లక్షల సంఖ్యలో ఉన్న టీచర్లు, ఉద్యోగుల డిమాండ్లపై ఎందుకు 'రివర్స్'లో వెళ్లాలని చూస్తుందంటూ మండిపడుతున్నారు.

గెజిట్ నోటిఫికేషన్ల దగ్ధం

జిపిఎస్ అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌పై విశాఖలో శనివారం సాయంత్రం ఎన్ఎడి జంక్షన్‌లో యుటిఎఫ్ విశాఖ జిల్లా మిగతా 2లో..

అనకాపల్లి ఎస్‌పిగా దీపిక

- అనంతపురానికి మురళీకృష్ణ బదిలీ

దీపిక

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి జిల్లా ఎస్‌పి కెవి.మురళీకృష్ణను ప్రభుత్వం బదిలీచేసింది. ఆయన స్థానంలో ఎం.దీపికను నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీచేసింది. మురళీకృష్ణను అనంతపురం ఎస్‌పిగా బదిలీచేసి, విజయనగరం ఎస్‌పి దీపికను అనకాపల్లి జిల్లా ఎస్‌పిగా నియమించింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా మురళీకృష్ణ మంచి కృషి చేశారు.

విశాఖ డిసిపి 1, 2గా అజిత, తుహిన్ సిన్హా

ఎంవిపి.కాలనీ : పశ్చిమ గోదావరి ఎస్‌పిగా విధులు నిర్వహిస్తున్న 2015 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన అజిత వేజెండ్లను విశాఖ పట్నం డిసిపి-1 గానూ, అల్లూరి సీతారామ రాజు జిల్లా ఎస్‌పిగా విధులు నిర్వహిస్తున్న 2017 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన తుహిన్ సిన్హాను విశాఖ పట్నం డిసిపి-2గాను బదిలీ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. అవి తక్షణమే అమలులోకి వస్తాయని వాటిలో పేర్కొన్నారు.

పోలీసాధికారులకు సత్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తూ శనివారం మధ్యాహ్నం ఉద్యోగోన్నతి పొందిన 19 మంది సిబ్బందిని స్థానికంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రాత బాగ్చి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులంతా అంకితభావంతో పని చేశారన్నారు. మున్ముందు మరిన్ని ఉన్నత బాధ్యతలు అలంకరించాని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ డాక్టర్ కె.ఫక్కీరప్ప, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

▶ వార్త 2లో..

బాబును విమర్శించే స్థాయి అమర్‌కు లేదు

▶ వార్త 2లో..

పోరాటాలతోనే 'ఉక్కు' పరిరక్షణ

▶ వార్త మెయిన్‌లో..

జిల్లా గ్రంథాలయ భవనం నిర్మించాలి

- మంత్రి లోకేష్‌కు మాజీ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ లేఖ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మహారాణిపేట దండు బజారులో ఉన్న జిల్లా గ్రంథాలయ సంస్థ స్థలంలో నూతన భవనాన్ని తక్షణం నిర్మించాలని మాజీ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ కోరారు. శనివారం ఈ మేరకు ఆయన రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్‌కు ఒక లేఖ రాశారు. ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. అప్పటి ప్రభుత్వాలు గ్రంథాలయం ప్రజలకు అందుబాటులో ఉండటం కోసం మహారాణిపేట దండు బజారులో ఎకరం స్థలాన్ని కేటాయించాయని, ఆ స్థలంలోనే గ్రంథాలయం ఒక చిన్న బిల్డింగ్‌లో 2010 వరకు నడిచిందని గుర్తుచేశారు. గ్రంథాలయం అవసరాల కోసం జివిఎంసి లైబ్రరీ సెస్ ద్వారా ఏటా నిధులు సేకరిస్తోందన్నారు. ఈ రోజు వరకూ ఆ దిశగా జివిఎంసి వద్ద సుమారు రూ. 200 కోట్ల నిధులు సేకరించబడ్డాయన్నారు. ఆ నిధులు జిల్లా గ్రంథాలయ సంస్థకు బదిలీ చేయాల్సి ఉందన్నారు. 2010లో ఒక ప్రైవేటు కంపెనీ గ్రంథాలయం స్థలాన్ని అప్పటి ప్రభుత్వంతో కుమ్మక్కై ఆక్రమించిందన్నారు. అంతేకాకుండా అక్కడ పనిచేస్తున్న గ్రంథాలయాన్ని కొంతమంది వ్యక్తుల స్వప్రయోజనాల కోసం రద్దీగా ఉన్న జంక్షన్‌లో ఒక అద్దె బిల్డింగ్‌కు తరలించిందని పేర్కొన్నారు. ఆ సందర్భంలో విశాఖ ప్రజలు ఒకే తాటి మీదకు వచ్చి ఆ విషయంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేసి కంపెనీ అగ్రిమెంటును రద్దు చేయించారన్నారు.

అప్పటి నుంచీ విశాఖ ప్రజలు దండు బజారులో స్థలాన్ని గ్రంథాలయ భవనం నిర్మించడం కోసం వెనక్కి ఇప్పించాలని జిల్లా అధికారులకు, ప్రభుత్వానికి పదేపదే విజ్ఞప్తి చేస్తూ వచ్చారని తెలిపారు. ఈ నేపథ్యంలో తిరిగి ఇవ్వవలసిన స్థలాన్ని సిఆర్‌పిఎఫ్ క్యాంపునకు బదలాయించడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రజల అవసరాలను గౌరవించి ప్రభుత్వం దండు బజారులో విశాలమైన గ్రంథాలయ భవనాన్ని నిర్మించే కార్యక్రమం చేపట్టాలని కోరారు.

ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రూ.170 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనులను జిల్లా కలెక్టర్ హరీంద్ర ప్రసాద్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మోడ్రన్ ఫిష్ మార్కెట్‌లో మంచినీటి సదుపాయం, 11వ నెంబర్ జెట్టీ వరకు తాగునీటి వసతి కల్పించాలని విశాఖ పోర్టు, జివిఎంసి అధికారులను ఆదేశించారు. ఫిషింగ్ హార్బర్‌లో మరమ్మతులు చేసుకోవడానికి సరైన సదుపాయం లేదని, డ్రై డాక్‌లో ఉన్నటువంటి ట్రాలీలను రిపేర్ చేయించాలని ఎపి మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వాసుపల్లి జానకిరామ్ కలెక్టర్‌ను ఈ సందర్భంగా కోరారు. ట్రాఫిక్ సమస్య హార్బర్‌లో అధికంగా ఉందని తెలిపారు. ట్రాఫిక్ పోలీసుల సహకారంతో ఆటోలను ఫిషింగ్ హార్బర్‌లోకి రాకుండా నిరోధించాలని, అనవసరంగా పేరుకుపోయినటువంటి వ్యర్థాలను ఎప్పటి కప్పుడు తొలగించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన కలెక్టర్ జివిఎంసి అధికారులను వేస్ట్ మేనేజ్మెంట్ ఫెసిలిటీ కోసం అవసరమైన డస్ట్ బిన్లు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు వ్యర్థాలు హార్బర్‌లో లేకుండా చూడాలని ఆదేశించారు. ఫిషింగ్ హార్బర్‌లో జరుగుతున్నటువంటి ఆధునికీకరణ పనులను విశాఖ పోర్ట్ అథారిటీ చీఫ్ ఇంజినీర్ వికాస్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జెడి విజయకృష్ణ, జివిఎంసి వాటర్ సప్లై అధికారి రవి, విశాఖ పోర్టు అథారిటీ ఇఇ అరుణ్ కుమార్, జెఇ విశ్వనాథ్, వాటర్ సప్లై ఇఇ శేఖర్, ఎఫ్‌డిఒ ఆశాజ్యోతి, డాల్ఫిన్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి వీర్రాజు, కార్యదర్శి వలిశెట్టి చిన్నా, సూరాడ సత్తిబాబు, గుంటు దానయ్య పాల్గొన్నారు.

హార్బర్‌లో ఆధునికీకరణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ హరీంద్ర ప్రసాద్

మొదటి పేజీ తరువాయి..

మీ విధానం కూడా అదేనా !

కమిటీ ఆధ్వర్యాన ఉపాధ్యాయులంతా నిరసన తెలియజేశారు. గెజిట్ కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టిఆర్.అంబేద్కర్‌లు మాట్లాడుతూ గత ప్రభుత్వం జిపిఎస్‌పై ముందుకెళ్లాలని చూడగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు చేసిన పోరాటాల ఫలితంగా తాత్కాలికంగానైనా జిపిఎస్ జిఒను విడుదల చేయకుండా ఆగిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం 'బ్యాక్ డేట్'తో జిపిఎస్ అమలుకు రాజపత్రాన్ని విడుదల చేయడం దుర్మార్గమని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం మన్నించకపోతే పోరాటాల రుచి చూపిస్తామంటూ హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఎ.పైడిరాజు, వైఆర్‌కె.ప్రసాద్, ఉప్పాడ రాము, రామకృష్ణ, ఫ్యాప్టో కో - చైర్మన్ సిహెచ్.వెంకటేశ్వర్లు, సిహెచ్.గణేష్ పాల్గొన్నారు.

పలు ప్రాంతాల నుంచి హాజరైన ట్యూషన్ కేంద్రాల నిర్వాహకులు

ఉత్సాహంగా ట్యూషన్ కేంద్రాలు నిర్వాహకుల శిక్షణ శిబిరం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : ట్యూషన్ కేంద్రాలు నిర్వాహకుల రెండు రోజుల ప్రాంతీయ శిక్షణ శిబిరం కంచరపాలెంలోని బిఎన్‌ఆర్ ఫౌండేషన్‌లో శనివారం ప్రారంభమైంది. ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. ఆంధ్రప్రదేశ్ చిల్డ్రన్స్ క్లబ్స్ కన్వీనర్ డాక్టర్ కె.రమాప్రభ ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువు విద్యార్థిలో అంతర్గతంగా ఉన్న అనేక నైపుణ్యాలను, సృజనాత్మకతను వెలికితీస్తుందన్నారు. అందుకు తరగతి గది ఆయువుపట్టు వంటిదని తెలిపారు. ఉల్లాసంగా, ఉత్సాహంగా బోధన చేసే ప్రక్రియ ద్వారా సమాజానికి అత్యున్నతమైన వ్యక్తులను, ఉన్నతమైన పౌరులను అందించగలమన్నారు. కానీ నేడు విద్యార్థులకు నాణ్యమైన చదువు కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకోసమే తలిదండ్రులు స్కూలు అనంతరం ట్యూషన్లకు పిల్లలను పంపిస్తున్నారని, అవి కూడా అత్యధిక ఫీజులతోనూ, లేకపోతే కేవలం హోం వర్క్ చేసే కేంద్రాలుగానూ ఉన్నాయన్నారు. పాఠశాల సిలబస్‌తో పాటు ప్రత్యేకంగా శాస్త్రీయ కోణంలో సిలబస్ చెప్పడం, వైజ్ఞానిక, సాంస్కృతిక కార్యక్రమాలను జోడించి విద్యార్థులను విజ్ఞాన వంతులుగా తీర్చిదిద్దడం కోసం వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ 2019 నుంచి ట్యూషన్ సెంటర్లు నిర్వహిస్తోందని తెలిపారు. ఇప్పుడు రాష్ట్ర వ్యాపితంగా ఆంధ్రప్రదేశ్ చిల్డ్రన్స్ క్లబ్స్ ద్వారా ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ కేంద్రాలకు ఆసరా ఛారిటబుల్ సొసైటీ, విశ్వ మానవ సంక్షేమ సంఘం సహకారం అందిస్తున్నాయని తెలిపారు. మొదటి రోజు సెంటర్ల నిర్వహణలో అనుభవాలు, ట్యూషన్ టీచర్లు, నిర్వాహకుల ప్రాధాన్యత, ఆవశ్యకత, చదువు ఎందుకు ? చదువులో కథలు, పద్యాల ప్రాధాన్యత ? చదువులో ఆటలు, పాటలు, డ్యాన్సులు ప్రాధాన్యత ఏమిటి ? అనే అంశాలు ఆక్టివిటీస్ ద్వారా పలు అంశాలను నేర్పించినట్టు తెలిపారు. కార్యక్రమ నిర్వహణ సతీష్ చేయగా వివిధ అంశాలపై ఎల్లాజీ, పార్థసారథి, నీలవేణి, గణేష్, కృష్ణవేణి, డి.శైలజ, రష్మిక ఇంటరాక్టివ్ సెషన్స్ నిర్వహించారు. విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కృష్ణా జిల్లాల నుంచి పలువురు పాల్గొన్నారు. చిల్డ్రన్స్ క్లబ్ నాయకులు వివి.జయ, డి.కొండమ్మ, కీర్తి, ఆశ్రిత, అప్పారావు, కృష్ణారావు, మణి, అరుణ, ధాన్ ఫౌండేషన్ ఎంకెఎస్ నుంచి యు.లక్ష్మి హాజరయ్యారు.

కెజిహెచ్‌లో కలెక్టర్ సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరీంద్ర ప్రసాద్ శనివారం కెజిహెచ్‌లో సుడిగాలి పర్యటన చేశారు. వివిధ వార్డులను పరిశీలించారు. అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. కొన్నిచోట్ల భవనాల పైభాగం పెచ్చులు ఊడిపోయి ఊసలు వెలుపలకు వచ్చి ఉన్న పరిస్థితిని గమనించారు. ఎంఆర్‌ఐ స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేసి అక్కడ అందుతున్న సేవలపై ఆరా తీశారు. పర్యటనలో భాగంగా అక్కడ పరిస్థితులపై, సమస్యలపై విభాగాధిపతులతో తొలి సమావేశం నిర్వహించారు. కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.శివానంద, ఎఎంసి ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, అన్ని విభాగాల హెచ్‌ఒడిలు, ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు నేడు సన్మానం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన శాసన సభ్యులను ఆదివారం సన్మానించనున్నామని యాదవ సంఘం అధ్యక్షులు ఒమ్మి సన్యాసిరావు తెలిపారు. శనివారం సాయంత్రం శివాజీ పాలెంలోని సవేరా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ యాదవ సామాజిక తరగతికి చెందిన గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, విశాఖపట్నం సౌత్ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్‌లను సన్మానించేందుకు ఆదివారం సాయంత్రం సిరిపురంలోని గురజాడ కళాక్షేత్రంలో ఆత్మీయ అభినందన సభ ఏర్పాటు చేశామన్నారు.

విలువలు పునరుజ్జీవింపాలి

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

సందర్భం వేరైనా, వేదిక వేర్వేరైనా విశాఖ ఉక్కు పరిశ్రమపై కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాటలు ఊరట ఇచ్చినట్లున్నా, ఈ మాటలతోనే విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ నిలిచిపోతుందని భావించవీల్లేదు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ప్రశ్నలేదంటూనే, ప్రధానితో మాట్లాడి ఒప్పించాల్సివుందని ఈ నెల 11న ఉక్కు పరిశ్రమ సందర్శన సందర్భంగా కేంద్రమంత్రి, అనకాపల్లి పర్యటనలో ఉక్కు పరిశ్రమ పరిరక్షణకు కట్టుబడివున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్న మాటల్లో భరోసా కనబడుతుంది తప్ప పరిశ్రమ ప్రయివేటీకరణ సంపూర్ణంగా ఆగిపోతుందని ఆనుకోలేం. 2021 జనవరిలో కేంద్ర మంత్రివర్గం విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణకు తీసుకున్న నిర్ణయాన్ని పునస్సమీక్షిస్తామనిగానీ, ఆ నిర్ణయం వెనక్కుతీసుకుంటామనిగానీ కుమారస్వామి చెప్పలేదు. పరిశ్రమను ప్రయివేటీకరించడానికి మోడీ ప్రభుత్వం పన్నని కుట్రల్లేవు. కుతంత్రాల్లేవు. పరిశ్రమ ఉత్పత్తి సామర్థ్యాన్ని దెబ్బతీసి బలహీనపర్చి నష్టాల్లోకి నెట్టి, వదిలించుకోవాలని చేసిన ప్రయత్నాలు అన్నీఇన్నీకావు. ఈ కుతంత్రాల మూలంగా పరిశ్రమ కునారిల్లడంతో ఉద్యోగులకు నెలవారీ జీతాలు సకాలంలో ఇవ్వలేని దుస్థితికి తీసుకొచ్చింది. ఉక్కు పరిశ్రమపై సానుకూల మాటలు మాట్లాడితే సరిపోదు. దీనికి సొంత గనులు కేటాయించి, పూర్తిస్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో నడవడానికి అవరోధాలు సృష్టించకుండా వుండాలి. ఎన్‌డిఎలో భాగస్వామిపక్షమైన రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించే వరకు విడవకుండా పట్టుబట్టాలి. ఒత్తిడి తేవాలి. అప్పుడే పరిశ్రమ పరిరక్షణకు కట్టుబడివున్నామన్న చంద్రబాబు మాటలకు విలువవుంటుంది.

అదే రోజున అనకాపల్లి, విశాఖ పర్యటనకు వచ్చిన చంద్రబాబు నాయుడు ఇచ్చిన కొన్ని హామీలతో ప్రజల్లో ఆశలు కలిగాయి. దార్లపూడి వద్ద పోలవరం ఎడమ ప్రధాన కాలువ అక్విడెక్ట్ పరిశీలనకు వచ్చిన

ఆయన రూ.800 కోట్లతో ఎడమ కాలువ పనులు 93 కిలోమీటర్ల వరకు పూర్తిచేసి లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. హామీతో సరిపెట్టుకోకుండా నిర్దిష్ట కాలపరిమితిలో పనులు పూర్తిచేసి సాగునీరందించే వరకు ఆ పట్టుదల వుండాలి. గత ప్రభుత్వంలో సాగునీటి వనరులు అభివృద్ధి చేయడంలో అంతులేని నిర్లక్ష్యం వహించిందన్న బాబు విమర్శ ఎంతనిజమో, అంతకు ముందు ఎడమకాలువ పనులపై తన ప్రభుత్వంలో అంతే నిర్లక్ష్యం జరిగిందన్నది అంతే నిజం. ఇప్పటికైనా తొలి దశలో చేపట్టనున్న పనులకు కాలదోషం పట్టకుండా నిధులు విడుదలచేయాలి. ఎడమ కాలువపైనే ఉత్తరాంధ్రలోని 8 లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యం కల్పించే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు ఆధారపడివుంది. ఎడమ కాలువ పనులు చేపడుతూనే సుజల స్రవంతి పనులు జరిగేలా ప్రభుత్వం నిధులు కేటాయించాలి.

తన పర్యటనల్లో గత ప్రభుత్వ అప్రజాస్వామిక, అభివృద్ధి నిరోధక చర్యలను చంద్రబాబు దుయ్యబడితే సరిపోదు. తన ప్రభుత్వంలో అవి జరగకుండా చూడగలగాలి. ఈ పనిచేయకుండా గత ప్రభుత్వ తప్పిదాలను విమర్శిస్తే ఫలితం వుండదు. చంద్రబాబు పర్యటనలో గత ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలే బయటపడ్డాయి. సిపిఎం నాయకులను గృహ నిర్బంధం చేసిన తీరు, విశాఖ నగరంలోని డెక్కన్ క్రానికల్ దినపత్రిక కార్యాలయంపై టిడిపి కార్యకర్తల దాడి గత ప్రభుత్వ నియంతృత్వ పద్ధతుల కొనసాగింపులా వున్నాయి. ఈ దుర్మార్గాలు, అప్రజాస్వామిక చర్యలను ప్రజలు ఆదరించరని, ఆమోదించరని గుర్తించాలి. ప్రజలిచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేసుకోకుండా, ప్రజాస్వామిక విలువలను కాపాడుతూ, అభివృద్ధికి బాటలు వేయాలి.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, సీతమ్మధార : సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను తక్షణమే కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం దక్షిణ నియోజకవర్గం పరిధిలోని సింకా గ్రాండ్‌లో ఎపి వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఎపి బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన విశాఖపట్నం యూనిట్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2014 నుంచి ఆయా ప్రభుత్వాలు జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించలేదని, దీనివల్ల ఎంతో మంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఒక ప్రభుత్వం టిడ్కో ఇళ్లు కేటాయించనున్నట్లు దరఖాస్తులు స్వీకరించగా, మరో ప్రభుత్వం మూడు సెంట్లు స్థలాలు అందిస్తామని ఆన్‌లైన్‌లో దరఖాస్తులు తీసుకొని ఏమీ చేయలేదన్నారు. అక్రిడేషన్, అటాక్స్ కమిటీలను తిరిగి పునరుద్ధరించాలని, 11 రాష్ట్రాలలో అమలు చేస్తున్న జర్నలిస్టుల పెన్షన్ స్కీంను ఎపిలోనూ అమలు చేయాలని కోరారు. సమావేశానికి అధ్యక్షత వహించిన సంఘం రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ చాలా కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న ఐదు ప్రధాన అంశాలపై ఈ కార్యవర్గ సమావేశంలో తీర్మానాలు చేశామన్నారు. వీటిని త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు నివేదిస్తామన్నారు. గతంలో ఉన్న నిబంధనను తొలగించి అక్రిడేషన్లు జారీ ప్రక్రియను సులభతరం చేయాలన్నారు. రాష్ట్ర నాయకులు కొండబాబు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలు పరిష్కారానికి నిరంతరం యూనియన్ రాజీలేని పోరాటం సాగిస్తోందన్నారు. విశాఖ అర్బన్ అధ్యక్షులు పి.నారాయణ మాట్లాడుతూ జర్నలిస్టులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. సమావేశంలో రూరల్ అధ్యక్షులు వెంకటేష్, ఫెడరేషన్ నాయకులు ఈశ్వరరావు, ఎన్.మధుసూదనరావు, ఇరోతి ఈశ్వరరావు మాట్లాడారు.

మాట్లాడుతున్న ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు

నూతన కార్యవర్గం ఎన్నిక

ఎపిడబ్ల్యుజెఎఫ్ నూతన జిల్లా అధ్యక్షులుగా పోతుమహంతి నారాయణ, కార్యదర్శిగా జి.శ్రీనివాసరావు, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా ఎ.సాంబశివరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా డి.రవికుమార్, పి.సూర్యప్రసాద్, కోశాధికారిగా బి.సీతారామమూర్తి, ఉపాధ్యక్షులుగా టి.కృష్ణమూర్తి నాయుడు, కె.సత్యనారాయణ, కె.మురళీకృష్ణ, కె.కృష్ణపాత్రో, ఎన్.రామకష్ణ, బండారు శివప్రసాద్, సంయుక్త కార్యదర్శులుగా ఆర్.వరప్రసాద్, పిల్లా నగేష్ బాబు, గొడబ రాంబాబు, పి.నాగేశ్వరరావు, పక్కి వేణుగోపాల్, వై.రామకష్ణ మరో 15 మంది కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అందరూ చూడదగ్గ సినిమా 'డార్లింగ్'

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : డార్లింగ్ (వై దిస్ కొలవెరి) అందరూ చూడదగ్గ చిత్రమని హీరో ప్రియదర్శి అన్నారు. ఆ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా శనివారం దక్షిణ నియోజకవర్గంలోని గ్రీన్ పార్క్ హోటల్‌లో చిత్ర యూనిట్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సినిమా ఈ నెల 19న విడుదల అవుతుందన్నారు. ప్రైమ్ షో ఎంటర్‌మైన్‌మెంట్ పతాకం మీద కె.నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ చిత్రం నిర్మించారని తెలిపారు. వివేక్ సాగర్ మంచి సంగీతం అందించారని ప్రశంసించారు. రెండేళ్ళ తర్వాత నభా నటేశ్ నటించిన చిత్రమిదని తెలిపారు. భార్యాభర్తల గొడవలు నేపథ్యంలో పుట్టే హాస్యం నవ్విస్తుందని, పెళ్లి తరువాత ఆడవాళ్లు గొప్ప వాళ్లు అని తెలుసుకుంటారని తెలిపారు.

బాబును విమర్శించే స్థాయి అమర్‌కు లేదు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఉద్దేశించి వ్యాఖ్యలు చేసే స్థాయి మాజీ మంత్రి అమర్‌నాథ్‌కు లేదని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ అన్నారు. నిజంగా అమర్‌కు చిత్త శుద్ధి ఉంటే తనతో చర్చకు రావాలని సవాల్ చేశారు. శనివారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి 14వ వార్డు అధ్యక్షులు పివి.వసంతరావు, బొల్లినేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కల్యాణ మండప పనుల పరిశీలన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అల్లిపురం 32వ వార్డు చలవతోటలో నిర్మిస్తున్న కల్యాణ మండపం పనులను నియోజకవర్గ జనసేన నాయకులు, వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు శనివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.92 లక్షల అంచనా వ్యయంతో ఈ కల్యాణ మండపాన్ని జివిఎంసి నిర్మిస్తున్నట్లు చెప్పారు.

CHANGE OF NAME

I, **SURESH JAIN** (Old Name) S/o. Late Jain Ghewar Chand, D/No. 11-8-34-34-1, Plot No-32, Waltair ward, Daspalla Layout, Visakahapatnam. I have changed my name as **JAIN SURESH KUMAR** (New Name). Hereafter my name is known as **JAIN SURESH KUMAR** (New Name)

డాక్‌యార్డ్ ఉద్యోగులకు అండగా ఉంటా

ప్రజాశక్తి -గోపాలపట్నం : నేవెల్ డాక్ యార్డ్ కెటిబి ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి తమ వంతు బాధ్యతగా కృషి చేస్తామని విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు భరోసానిచ్చారు. శనిఆరం నేవల్ డాక్‌యార్డ్ కాపు, తెలగ, బలిజ ఉద్యోగుల అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షులు బత్తుల చిరంజీవి ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు ఎమ్మెల్యే గణబాబును ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉద్యోగులంతా ఎమ్మెల్యేకు సింహాద్రినాధుని చిత్రపటాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం తమ సమస్యలను విన్నవించారు. దీనిపై ఎమ్మెల్యే గణబాబు స్పందిస్తూ, ప్రభుత్వాలపై ఆధారపడకుండా ఉద్యోగులంతా స్వతంత్రంగా డాక్‌యార్డ్‌కు సంబంధించి సామాజిక భవనం, కళాక్షేత్రం నిర్మించుకోవడం గొప్ప విషయమన్నారు. సమిష్టి కృషి చేసిన సభ్యులను అభినందించారు. అసోసియేషన్ సభ్యులు తన దృష్టికి తెచ్చిన సమస్యలను ప్రభుత్వపరంగా త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో కెటిబి అసోసియేషన్ సభ్యులు సన్యాసిరావు, శ్రీనివాస్, రాజెకుమార్, రమణ, వెంకటేష్, బిఎస్.నాయుడు, శ్రీహరి,రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గణబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న కెటిబి సభ్యులు

మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారంపై దృష్టి

గోపాలపట్నం : రైల్వే స్థలంలో ఉన్నసరైన డ్రైనేజీ లేకపోవడంతో మురుగునీటితో పడుతున్న ఇబ్బందుల పరిష్కారానికి తగు చర్యలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే పెతకం శెట్టి గణబాబు అన్నారు. శనివారం బాజీ జంక్షన్ , బుచ్చిరాజుపాలెం, ఎన్ఎడి వద్ద రైల్వే ఆర్ఒబి నుంచి గణేష్‌నగర్, వెనక రైల్వేట్రాక్ దరి నుంచి సంపత్ అపార్ట్‌మెంట్, తారకరామా అపార్ట్‌మెంట్, కరాస ప్రియాంకకాలనీ, శ్యామ్‌నగర్ కాలనీ మీదుగా కంచరపాలెం వరకు మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాలను పరిశీలంచారు. నీరు నిల్వతో దోమలు విజృంభించి, సీజన్ వ్యాధులు ప్రబలుతున్నాయని స్థానికులు ఎమ్మెల్యే గణబాబు దృష్టికి తేగాసమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈమేరకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించించాలని పరిశీలనకు తనతో వచ్చిన జివిఎంసి, రైల్వే ఇంఇనీరింగ్ అధికారులకు సూచించారు. 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ, వార్డు టిడిపి అధ్యక్షుడు ఎలమంచిలి ప్రసాద్, జిల్లా నాయకులు మళ్ల అప్పారావు, వై.తిరుమలరావు, 52వ వార్డు అధ్యక్షుడు వాసుదేవరావు,సెక్రటరీ పాల శ్రీను, పెంటకోట అజయ్‌బాబు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి -ఆనందపురం :మండలంలోని ఇచ్ఛాపురం గ్రామంలో స్థానిక పిహెచ్‌సి వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరం 30 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అనారోగ్యంతో బాధపడుతున్న పలువురి నుంచి మలేరియా పరీక్షల నిర్వహణకు రక్తనమూనాలను సేకరించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ పి.సాంబమూర్తి, హెచ్ఎస్ కృష్ణ మోహన్, పార్వతమ్మ, ఆరోగ్య సేవకులు తారకేశ్, ఎంఎల్‌హెచ్‌పి స్వర్ణలత, ఎఎన్ఎం మెట్ట దేవి, ఆశ కార్యకర్త దేముడమ్మ పాల్గొన్నారు.

ఎట్టకేలకు కాలువల్లో పూడికతీత

ప్రజాశక్తి-పెందుర్తి : గవర జగ్గయ్యపాలెం రైల్వే ట్రాక్ వద్ద ఐదు అడుగుల కాలువలో ఎట్టకేలకు పూడికతీత పనులు చేపట్టారు. ఐదేళ్లుగా ఇక్కడి కాలువలో పూడికలు పేరుకుపోయి, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతూ, అధికారులు, నేతలకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని వాపోయారు. ఇటీవల జనసేన టిడిపి నాయకులు సమస్యను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ఆదేశాల మేరకు జివిఎంసి సిబ్బంది శనివారం పూడికలు తొలగించేందుకు రాగా, స్థానిక జనసేన, టిడిపి, కూటమినేతలు దగ్గరుండి పనిచేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బుదిరెడ్డి శివ, ముత్తా అర్జున్, పొలమరశెట్టి భాను, పోలరాతి మురళీకృష్ణ, ముత్తాగోపి, గనిశెట్టి కుమార్, గల్లా భాగ్యరాజు, శ్యామ్, అచ్యుత్, వినోద్, త్రినాధ్ బాలు, చక్రి, టిడిపి నాయకులు పొలమరశెట్టి బుల్ రాజు, ముత్త సత్తిబాబు, టి చలపతిరావు, మురళి వాసు మన్మధరావు నాగేష్ పాల్గొన్నారు.

గ్రీవెన్స్ కమిటీ సభ్యునికి అభినందన

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ ఎస్‌సి, ఎస్‌టి గ్రీవెన్స్ కమిటీ సభ్యునిగా నియమితులైన స్టీల్‌ప్లాంట్ ఎంఎంఎంఎస్ విభాగం డిజిఎం మనోజ్ ఓరాన్‌ను ఆ విభాగం ఎస్‌సి,ఎస్‌టి ఉద్యోగుల సంక్షేమ సంఘం శనివారం ఘనంగా సత్కరించింది. ఐ.ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ అభినందన కార్యక్రమానికి డిజిఎం (ఎలక్టికల్) ఎఎం తివారీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మనోజ్ ఓరాన్ స్టీల్‌ప్లాంట్ ఎస్‌సి, ఎస్‌టి గ్రీవెన్స్‌సెల్ కమిటీ సభ్యునిగా నియమితులు కావడం అభినందనీయమన్నారు.

ఈ సందర్భంగా మనోజ్ ఓరాన్‌ను అధికారులు, ఉద్యోగులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఐ. చిట్టిబాబు, అధికారులు ఎం.చంద్రశేఖర్, బి.గణేష్, ఎండి బోయర్ ఎవి.సత్యనారాయణ, డి.శ్రీనివాస్, విద్యుత్ కుమార్‌వర్మ, టి. వేణు, జి. ఆనంద్, ఎస్.నర్సింగరావు , మహిళా ఉద్యోగిని టి.రవళి, విఎస్‌పి ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. తవుడన్న, బయ్యే మల్లయ్య, నాయకులు డి.పుల్లారావు, రత్నం, బానోత్‌కృష్ణ పాల్గొన్నారు

అనకాపల్లికి ఏం చేశారో చెప్పాలి

మాజీ మంత్రి అమర్‌ను ప్రశ్నించిన మూర్తి యాదవ్

ప్రజాశక్తి- సీతమ్మధార : ఎమ్మెల్యేగా, మంత్రిగా ఐదేళ్లలో అనకాపల్లి నియోజకవర్గానికి గుడివాడ అమర్‌నాథ్ ఏం చేశారో చెప్పాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ప్రశ్నించారు. శనివారం పౌర గ్రంథాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, గెలిపించిన ప్రజల సమస్యలను గానీ, తనకు కేటాయించిన మంత్రిత్వశాఖకు సంబంధించిన వ్యవహారాలుగానీ చూడకుండా విపక్షాలపై విమర్శలకే పరిమితమైన అమర్‌నాథ్, అనకాపల్లి వాసుల దాహార్తిని కూడా తీర్చలేకపోయారన్నారు. పోలవరం ఎడమకాలువను పట్టించుకోలేదన్నారు. అనకాపల్లి, చోడవరం రోడ్డు దుస్థితిని చూస్తే అమర్ పనితనం ఏపాటిదో స్పష్టమౌతుందన్నారు. విస్సన్నపేటలో 600ఎకరాల భూముల్ని కొట్టేయడం వాస్తవం కాదాయని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నెల రోజుల్లోనే సిఎం చంద్రబాబు పోలవరం ఎడమ కాలువ సందర్శనకు వచ్చి, రూ.800కోట్లతో 93కిలోమీటర్ల మేర ఎడమ కాలువ నిర్మాణానికి చర్యలు చేపట్టడం ద్వారా అనకాపల్లిని నీరించేందుకు కృషి చేస్తుంటే, ఎప్పటిలాగానే మైకు ముందుకు వచ్చి స్థాయికి మించిన విమర్శలు చేస్తున్నాడని మాజీ మంత్రి అమర్‌పై మండిపడ్డారు. ఐటీ మంత్రిగా విశాఖ ఐటీ హిల్స్‌లో ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రభుత్వ కార్యాలయాలుగా మార్చాలని, అక్కడి కంపెనీలన్నీ తరలించేశారని మూర్తి యాదవ్ మండిపడ్డారు. రాజధాని పేరుతో విశాఖ భూముల్ని దోచేశారని ఆరోపించారు.

సాంకేతిక విద్యలో నైపుణ్యం పెంచుకోవాలి

ప్రజాశక్తి -తగరపువలస :సాంకేతిక విద్యలో విజ్ఞానంతోపాటు నైపుణ్యం పెంపుదలకు ప్రాధాన్యత ఇవ్వాలని పరిశ్రమ నిపుణులు నర్రా సురేష్ స్పష్టం చేశారు. శనివారం స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాల క్యాంపస్‌లో డిసిహెడ్ విద్యార్థులతో ఇన్ఫోసిస్ విశాఖ రీజియన్‌కు చెందిన సురేష్ ముఖాముఖినిర్వహించారు. అన్ని విభాగాల ఇంజనీరింగ్ విద్యార్థులు 550 మంది చురుగ్గా పాల్గొన్నారు

ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ, ఒక వ్యక్తి పరిపూర్ణంగా ఉండాలంటే ఎంచుకున్న రంగంలో పూర్తిస్థాయిలో పట్టు పెంచుకోవాలనిసూచించారు. ఉద్యోగార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, సమస్య ఐడెంటి ఫైయర్స్, ప్రాబ్లమ్ సాల్వర్స్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. కమ్యునికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ గ్రూమింగ్, క్రియేటివిటీ ప్రాధాన్యతను వివరించారు. ఇంటరాక్టివ్ సెషన్‌లో విద్యార్థులు లేవనెత్తిన అనేక సందేహాలను పరిశ్రమ నిపుణులు నివృత్తి చేశారు.కార్పొరేట్ ప్రపంచంలో చోటుచేసు కుంటున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమను తాము తీర్చి దిద్దుకోవాలని సూచించారు. అత్యుత్తమ ఉద్యోగాలు పొందేందుకు తమ వంతు కృషి చేయాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి మురళీకృష్ణ, డైరెక్టర్ డాక్టర్ ఎ చంద్రశేఖర్, డీన్, ప్లేస్‌మెంట్ హెడ్ డాక్టర్ టి శ్రీనివాసరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.రూప సుందరరావు, కళాశాల పూర్వవిద్యార్థి, ఇన్ఫోసిస్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మహేష్ పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల అక్రమాలకు అడ్డుకట్ట వేయండి

ప్రజాశక్తి- సీతమ్మధార : జిఒ 596 ప్రకారం ఫ్రీహోల్డ్ చేసిన అసైన్డ్ భూముల కొనుగోలులో అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని విదసం ఐక్య వేదిక రాష్ట్ర సమితి సమన్వయకర్త డాక్టర్ బూసి వెంకటరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. శనివారం అంబేద్కర్ భవన్‌లో విలేకర్లుతో మాట్లాడుతూ, 35/2023 అసైన్డ్ చట్టసవరణ జిఒ రాక ముందే మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, వైసిపి నేతలు రైతులను మభ్యపెట్టి ముందస్తు ఒప్పందాలతో, దళారీల ద్వారా వందల ఎకరాల అసైన్డ్ భూములు అక్రమంగా కొనుగోలు చేసి ఇన్‌సైడ్ ట్రేడింగ్‌కు పాల్పడ్డారని ఆరోపించారు. రాష్ట్రంలో 34వేల ఎకరాల అసైన్డ్ భూములు అక్రమంగా బదలాయింపు జరిగి, రిజిస్ట్రేషన్ జరగ్గా, ఉత్తరాంధ్ర జిల్లాల్లో రెండు వేల ఎకరాలకు పైబడి చేతులు మారాయన్నారు. జిఒ విడుదలైన నెలరోజుల వ్యవధిలో వేలాది ఎకరాలు రిజిస్ట్రేషన్ కావడం, అసైన్డ్ లబ్ధిదారుల నిజజాబితా క్షేత్రస్థాయిలో పరిశీలకుండా, హక్కుదారుల వివరాలు వెబ్‌ల్యాండ్‌లో నమోదు కాకుండా కలెక్టర్ ఆదేశాలతో దొంగ రిజిస్ట్రేషన్లకు పాల్పడి వేలాది ఎకరాలను కాజేశారన్నారు. అసైన్డ్ భూముల క్రయవిక్రయాలపై షరతులు విధిం చాలని, ఏజెన్సీలోని 1/70చట్టం తరహాలో లబ్ధిదారుల సామాజిక వర్గానికి చెందిన వారికి తప్పని సరయితే విక్రయించుకునేలా జీఒలో చట్టసవరణ చేయాలని కోరారు. దీనిపై సిఎం చంద్రబాబు, సాంఘిక సంక్షేమ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి దృష్టి పెట్టి, వైసిపిహయాంలో నష్టపోయిన దళిత రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సోడదాసి సుధాకర్, ఈతలపాక సుజాత, జాజి ఓంకార్, బల్ల కుమార్, బూల భాస్కరరావు, గుడివాడ ప్రసాద్, డి నిర్మల పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మహిళల దుర్మరణం

-లారీలు ఢీకొని మృత్యువాత

-అగనంపూడిలో ఒకరు, గాజువాకలో ఇద్దరు

ప్రజాశక్తి-గాజువాక :గాజువాక పంతులుగారు మేడ వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటీని లారీ ఢీకొన్న ఘటనలో ఇద్దరు మహిళలు దుర్మరణం పాలయ్యారు. దీనికి సంబంధించిన వివరాలివి.

అగనంపూడికి చెందిన జాజుల పార్వతి (55) ఆయన భర్త, కుమార్తె సత్యవతి, కుమారుడు పార్థుతో నలుగురు కలిసి సింహాచలంలో శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా, పంతులు గారి మేడ వద్ద వెనక నుండి వస్తున్న లారీ వీరు ప్రయాణిస్తున్న స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జాజుల పార్వతితోపాటు ఆమె కుమార్తె సత్యవతి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సూరిబాబు, పార్థు వీరిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. దీనిపైన గాజువాక ట్రాఫిక్ సిఐ కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అగనంపూడిలో...

ఉక్కునగరం :అగనంపూడి ఏరియా ఆసుపత్రి ఎదుట అనకాపల్లి-గాజువాక రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మతి చెందింది. బైక్‌ను లారీ ఢీకొన్న సంఘటనలో శరగాన రేవతి(26)అక్కడికక్కదే మతిచెందింది. గోవాడకు చెందిన శరగాన రేవతి, తన భర్తతో కలిసి మింధి గ్రామానికి బైక్‌పై వెళ్తుంది. అగనంపూడి ఏరియా ఆసుపత్రి వద్ద వెనుకనుంచి లారీ ఢీకొట్టడంతో ఆమె భర్త కళ్లెదుటే అక్కడికక్కడే మృతి చెందింది. అందిన సమాచారం మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని అగనంపూడి ఆసుపత్రికి తరలించారు. కాగా, అగనంపూడిలో మరో రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్ఇసిఎస్ కార్యాలయం సమీపంలో బస్సును లారీ ఢీకొంది. అయితే ఈ ప్రమాదంలో ఎవ్వరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

గంజాయితో మహిళ అరెస్ట్

ప్రజాశక్తి -మధురవాడ: పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ వై.రామకృష్ణ తెలిపారు. వివం జివిఎంసి ఏడోవార్డు వాంబే కాలనీకి చెందిన బి.దుర్గ అనే మహి శ్మశానవాటిక సమీపంలో గంజాయి విక్రయిస్తోందని పక్కాగా అందిన సమాచారం మేరకు పిఎం.పాలెం సిఐ సునీత ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి ఆమెను పట్టుకుని కేసు నమోదు చేశారన్నారు.గంజాయితో పట్టుబడిన మహిళ దుర్గను విచారించగా, దేవరాపల్లి నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి తెచ్చి, ఇక్కడ చిన్నపాకెట్లుగా తయారుచేసి అధికధరకు విక్రయిస్తున్నట్లు ఒప్పుకుందని సిఐ తెలిపారు. ఈ మేరకు నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆర్‌టిసి బస్సులో రెండు కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-ఉక్కునగరం : దువ్వాడ మంగళపాలెం దగ్గర వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు, చోడవరం నుంచి గాజువాక వచ్చే ఆర్టీసీ బస్సులో బ్యాగులో రెండు కేజీల గంజాయిని పట్టుకున్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు, శనివారం తనిఖీలు చేస్తుండగా చోడవరం నుంచి వస్తున్న బస్సులు ఎక్కిఅనుమానాస్పదంగా కనిపించడంతో విచారణ చేపట్టారు. బ్యాగులు తనిఖీ చేయగా, అందులో రెండు కిలోల గంజాయి పట్టుబడింది. నిందితుడిని అదుపులో తీసుకొని పోలీసులు విచారణ చేపట్టారు.

గంజాయిని పట్టుకున్న పోలీసులు

ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌పై అవగాహన

మాట్లాడుతున్న విశ్రాంత విసి నరసింహులు

ప్రజాశక్తి-గాజువాక: గాజువాక ఎమ్‌విఆర్ కళాశాలలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంపై అధ్యాపకులకు కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయలసీమ యూనివర్సిటీ విశ్రాంత వైస్‌ఛాన్స్‌లర్ వై నరసింహులు పాల్గొని మాట్లాడుతూ, భవిష్యత్తులో విద్యావిధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా అధ్యాపకులు శిక్షణ పొందాలని కోరారు. కంప్యూటర్ ద్వారా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు విధాలుగా విద్యాబోధన చేయాల్సి ఉంటుందని, దానికి అప్‌డేట్ అవుతూ అధ్యాపకులు సంసిద్ధులుగా ఉండాలని సూచించారు. ప్రొఫెసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, సాఫ్ట్ స్కిల్స్ ప్రాముఖ్యతను వివరించారు. ముస్ముందు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా విద్యాబోధన సాగే రోజులు రానున్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ వి.రామారావు, ప్రొఫెసర్ మార్కండేయులు, వైస్ ప్రిన్సిపల్ బాలకృష్ణ, కృష్ణ పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా వ్యర్థాలు

దుర్గంధంతో అవస్థలు

ఫకీరు తకియా రోడ్డులో ఇరువైపులా వేసిన చెత్తాచెదారం, వ్యర్థాలు

ప్రజాశక్తి-ఉక్కునగరం :కూర్మన్నపాలెం పరిధి ఫకీర్‌తకియాకు వెళ్లే రోడ్డులో ఇరువైపులా చెత్తాచెదారం, వ్యర్థాలు వేస్తుండడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు దుర్గంధంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. రైతు మార్కెట్ ద్వారా వస్తున్న చెత్తంతా రోడ్డ పక్కనే వదిలివేయడం వల్ల అది కుళ్ళిపోయి దుర్వాసన వస్తుంది. దీంతో స్థానికులు దుర్వాసన వల్ల తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారు. జీవీఎంసీ సిబ్బంది సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఉండటంతో స్థానికులు వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు ఫార్మాసిటీ ఉద్యోగులు అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో ద్విచక్ర వాహనాల తాకిడి అధికంగా ఉంటుంది. రోడ్డకు ఇరువైపులా వ్యర్థాలు వేయటం వల్ల వాహనాల టైర్లు జారుతున్నాయని తద్వారా ప్రమాదాలకు గురవుతున్నామని స్థానికులు చెబుతున్నారు.

రేపటి నుంచి దుర్గాలమ్మ జాతర

ప్రజాశక్తి -మధురవాడ :జివిఎంసి ఎనిమిదో వార్డు ఎండాడలో ఉన్న దుర్గాలమ్మ జాతర ఈ నెల 15న సోమవారం నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం తోలేళ్ల ఉత్సవం, మంగళవారం అమ్మవారు ఊరేగింపు, అనుపు ఉత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేసినట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

బాలికలకు శానిటరీ నేప్కిన్ ప్యాడ్స్ పంపిణీ

ప్రజాశక్తి-భీమునిపట్నం :ఒడిషా మల్కన్‌గిరి జిల్లా పొడియా మట్టేరు గ్రామానికి చెందిన సుమారు వంద మంది గిరిజన బాలికలకు గంటా శారద హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షులు గంటా శారదఆర్థిక సాయంతో శని వారం శానిటరీ నాప్కిన్ పేడ్స్ అందజేసినట్లు స్వచ్ఛంద సంస్థ అధినేత వి శ్రీనివాసరెడ్డి తెలిపారు. దీనికి బాలికలు ధన్యవాదాలు తెలిపారు.

పేరు మారినా పనుల కొనసాగింపు!

- చురుగ్గా పాఠశాలల ఆధునికీకరణ పనులు
- 'నాడు నేడు' స్థానే 'స్కూల్ ఇన్నో డెవలప్‌మెంట్'

ప్రజాశక్తి -భీమునిపట్నం : రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో సహజంగానే ప్రభుత్వ ప్రాధాన్యతలు మారుతాయి. వాటితోపాటు పథకాల పేర్లు కూడా. గత ప్రభుత్వంలో 'నాడు నేడు' పథకం కింద ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ, మౌలిక సదుపాయాల కల్పన చేపట్టింది. అయితే వాటిని ఎక్కడా ఆపకుండా, కొనసాగించాలని కొత్త ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది. అయితే పథకం పేరు మాత్రం 'స్కూల్ ఇన్నో డెవలప్మెంట్'గా మార్చారు.

తొలివిడతలో 2020-21విద్యా సంవత్సరంలో రూ.9 కోట్లతో35 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను ఆధునీకరించి, పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించారు. డిజైన్ ప్రకారం పాఠశాలలో కార్పొరేట్ స్థాయిలో మార్పులు చేశారు. దీంతో సర్కారు బడుల్లో గ్రానైట్ రాయితో గచ్చులు, గ్రీన్ చాక్ బోర్డులు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం, ఫ్యాన్లు,ఫర్నిచర్ ఇలా అనేక సదుపాయాలు సమకూరాయి .

గోపాలపట్నం పాఠశాలలో ఆధునికీకరణ పనులు

మరో 42 పాఠశాలల్లో..

తర్వాత మరో 42 ప్రభుత్వ పాఠశాలల్లో రూ.15 కోట్ల 38 లక్షలతో అభివృద్ధి పనులను చేపట్టారు. ప్రస్తుతం 80 శాతం పనులు పూర్తయ్యాయి. జివిఎంసి నాల్గో వార్డు మంగమారిపేట ప్రాథమిక, ఉన్నత చేపల తిమ్మాపురం, గొల్లల పాలెం,1 ప్రాథమిక, మండలంలోని చిప్పాడ ఉన్నత పాఠశాల, ఎర్రయ్యపాలెం, కంచేరు పాలెం ప్రాథమిక పాఠశాల ల్లో చురుగ్గా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

ఉదరకోశ వ్యాధులపై అవగాహన

మాట్లాడుతున్న సిఐఇ చంద్రశేఖరరెడ్డి

ప్రజాశక్తి -తగరపువలస : ఉదర కోశ వ్యాధులపై స్థానిక సంగివలస, అనిల్ నీరుకొండ ఆసుపత్రిలో శనివారం ఆర్‌ఎంపిలకు అవగాహన కల్పించారు. ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణవైద్యుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆసుపత్రి ప్రొఫెసర్ డాక్టర్ ప్రభాకర్, సంస్థ సిఇఒ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు ప్రస్తుత ఆహారపు అలవాట్లు వల్ల కడుపులో గ్యాస్టిక్ సంబంధిత వ్యాధులు వస్తున్నాయని,. గ్యాస్టిక్ నివారణకు విచ్చలవిడిగా మాత్రలు వాడరాదనిసూచించారు. ప్రతి నొప్పికి, మంటకు గ్యాస్టిక్ మందులే వాడొద్దని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే ఆర్‌ఎంపిలు, వ్యాధి నివారించ లేనిపక్షంలో ఆసుపత్రికి రిఫర్ చేయాలని కోరారు. నిర్లక్ష్యం, అలసత్వం చేస్తే రోగి ప్రాణాలమీదకు వస్తుందని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంపిల ఫెడరేషన్ రాష్ట్ర ముఖ్య సలహా దారులు డాక్టర్ ఎన్ఎల్ రావు, ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జంగం జోషి, ఎన్ సుగుణేశ్వరి, కేన్సర్ ఫౌండేషన్ కార్యదర్శి కోనా ప్రకాష్, గౌరవ అధ్యక్షులు ఎం తిరుపతిరావు, జిల్లా అధ్యక్షులు ఆకుల శ్రీనివాసరావు, గెద్ద చిరంజీవి పాల్గొన్నారు. సదస్సుకు భీమిలి నియోజకవర్గంలోవివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్య లో ఆర్‌ఎంపిలుహాజరయ్యారు.

విశాఖ ఇంజినీరింగ్ కాలేజీకి స్వయంప్రతిపత్తి

ప్రజాశక్తి-పెందుర్తి : నరవలోని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీకి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ స్వయంప్రతిపత్తి హోదా కల్పించిందనికళాశాల చైర్మన్ సత్యనారాయణ తెలిపారు. శనివారం కళాశాల వద్ద మీడియా సమావేశంలో మాట్లాడుతూ, 2008లో ఏర్పాటైన తమ కళాశాల అంచెలంచెలుగా ఎదిగి, ఇప్పటికే జాతీయస్థాయిలో నేషనల్ కౌన్సిల్ అక్రిడిటేషన్ నుంచి గుర్తింపు పొందింది, ఇపుడు యుజిసి అటానమస్ హోదాను కూడా ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. కాలేజీ ఉన్నతికి కారకులైన అధ్యాపకులు, సిబ్బంది కృషి, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సహకారం మరువలేనిదని కొనియాడారు. తమ కళాశాలలో చదువుకున్న ఎంతోమంది నేడు వివిధ రంగాల్లో ఉద్యోగాల్లో స్థిరపడి కాలేజీకి మంచిపేరు

మాట్లాడుతున్న కాలేజీ చైర్మన్ సత్యనారాయణ

తెచ్చారని, ఇపుడు అటానమస్ హోదాతో మరో మెట్టు పైకెక్కామని హర్షం వెలిబుచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జివి.ప్రదీప్‌వర్మ, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బందిని అభినందించారు.

గ్రీన్‌బెల్ట్‌లో పచ్చదనం పెంపొందించండి

గ్రీన్‌బెల్ట్‌లోపనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యని శ్రీధర్.

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి 52వ వార్డు గ్రీన్‌బెల్ట్‌లో అవసరమైన మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించాలని నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం సంబంధిత జివిఎంసి అధికారులతో కలిసి వార్డులో పర్యటించారు. సంజీవయ్య నగర్, రిలయన్స్ పెట్రోల్ బంక్ సమీపంలో కళావేదిక నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం గ్రీన్‌బెల్ట్‌లోని పనులను పరిశీలించారు. వార్డును అత్యంత సుందరంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సింహాద్రి, సచివాలయం ఉద్యోగులు, వైసిపి శ్రేణులు పాల్గొన్నారు.

అనాథకు సేవా స్ఫూర్తి చేయూత

నిత్యావసరాలను అందజేస్తున్న సేవా స్ఫూర్తి సభ్యులు

ప్రజాశక్తి - ఆరిలోవ :అత్యంత దీనస్థితిలో ఉన్న ఓ కుటుంబానికి ప్రతి నెలా ఆహారపదార్థాలు అందించడానికి రవీంద్రనగర్ కేంద్రంగా సేవలందిస్తున్న సేవాస్ఫూర్తి సంస్థ ముందుకు వచ్చింది. ముడసర్లోవ దరి రాధాకృష్ణ నగర్‌లో నివాసముంటున్న పండా నాగమణి అనే మహిళ తీవ్ర అనారోగ్యంతో మంచంపై ఉంది. ఇరుగుపొరుగు వారిచ్చేదే తింటూ జీవనం సాగిస్తున్న తరుణంలో దయనీయ జీవనాన్ని సాగిస్తున్న ఆమెకు సేవా స్ఫూర్తి తరఫున ప్రతి నెలా 25 కిలోల బియ్యం, ఇతర కిరాణా సామగ్రి ఈ నెల నుంచి ఇస్తున్నట్లు అధ్యక్షులు ఒమ్మి అప్పలరాజు తెలిపారు. సేవాస్ఫూర్తి సభ్యులు ఎమ్. ప్రకాష్ పాత్రుడు, పద్మాజీ, నందు, నానాజీ, ఎ.గోవింద్, ఒమ్మి పోలారావు, ఈగల కొండలరావు, నంభారు గోపి, మోహన్ పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ పేరిట అన్నసమారాధన

అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న సందీప్

ప్రజాశక్తి -ఆనందపురం: జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ పిఠాపురంలో ఎమ్మెల్యేగా ఘనవిజయం సాధించిన సందర్భంగా వెల్లంకి గ్రామపంచాయతీలో గొలగాని గోవింద(బాలు) ఆధ్వర్యంలో జనసేన శ్రేణుల ఆర్థిక సహాయంతో డొక్కా సీతమ్మ పేరుతో సుమారు మూడు వేలమందికి అన్నదానం చేశారు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ సందీప్ పంచకర్ల పాల్గొని అన్నసమారాధనను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనసేన అధినేత, పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు డొక్కా సీతమ్మ పేరున పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అధినేత పిలుపుకు స్పందించిన వెల్లంకిలోని పార్టీ శ్రేణులను అభినందించారు. కార్యక్రమంలో బిజెపి ఇన్‌ఛార్జి రామానాయుడు, సర్దార్ రెడ్డి, సాయి అకీరా, ఉప్పాడ కల్యాణ్, గంగరాజు, తోనంగి రమణ, శేఖర్, మాదాబత్తుల శ్రీను, బి.కృష్ణ, సర్దార్ సురేష్, కేశవ, నవీన్, జగదీష్, లోకేష్, బంగారి, మురళిపాల్గొన్నారు

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత

మాట్లాడుతున్న ఎన్‌డిఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరావు

ప్రజాశక్తి -ఆనందపురం : అగ్ని ప్రమాదాలు జరగకుండా, జరిగాక నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై అప్రమత్తంగా ఉండాలని ఎన్‌డిఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరావు సూచించారు. శనివారం ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీ బొడ్డపాలెం వైజాగ్ ఇంపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్లైవుడ్ కంపెనీలో అగ్ని ప్రమాదాలు, తుఫానులు వంటి ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు వాటినుండి ఎలా రక్షణ పొందాలో కార్మికులకు ప్రజలకు అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రయోగాత్మకంగా వివరించారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు అక్కడ ప్రమాదాలు జరిగితే ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఆర్ఒ మణికంఠ, వైజాగ్ ఇంపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సిబ్బంది చంద్రశేఖర్ ,సత్యం, ఎస్ఇ శ్రీనివాసరావు, విఆర్ఒ అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విద్య ద్వారా పలు అవకాశాలు

- దేశంలో నిపుణులైన న్యాయవాదుల అవసరం ఉంది
- ఎపి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు

ప్రజాశక్తి-సబ్బవరం

నేషనల్ లా యూనివర్సిటీలు స్థాపనతో న్యాయ విద్యలో చాలా మార్పులు వచ్చాయని, నూతన విధానంలో న్యాయ విద్యను పూర్తి చేసిన వారికి అనేక అవకాశాలు లభిస్తున్నాయని ఎపి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు అన్నారు. మండలంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో 2024-25 మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు 'న్యాయ విద్య -భవిష్యత్ అవకాశాలు' అనే అంశంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ మన్మథరావు మాట్లాడుతూ న్యాయ విద్యలో వచ్చిన నూతన విధానం వల్ల మీడియేషన్, ఆర్బిట్రేషన్, మారిటైం, ఇంటెలెక్చుల్ ప్రాపర్టీ రైట్స్, వివిధ కార్పొరేట్ సంస్థల ద్వారా అనేక అవకాశాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. దీంతో ఎంతోమంది న్యాయ విద్య పట్ల ఆకర్షితులవుతున్నారన్నారు. అదే సమయంలో దేశంలో నిపుణులైన న్యాయవాదుల అవసరం ఎంతో ఉన్నదని పేర్కొన్నారు. ఎక్కువ మంది న్యాయ విద్యార్థులు తమ గ్రాడ్యుయేషన్ అనంతరం లైటిగేషన్ వైపు రాకుండా కార్పొరేట్ రంగాలవైపు వెళుతున్నారని, అందువల్ల క్షేత్రస్థాయిలో నిపుణులైన న్యాయవాదుల కొరత వస్తుందని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకొని న్యాయ విద్యార్థులు లోకల్ కోర్టుల్లో కొంతకాలం ప్రాక్టీస్ చేస్తే ట్రయిల్ కోర్టు అనుభవం రావడంతో పాటు ఎక్కువ మంది న్యాయవాదులు అందుబాటులోకి వస్తారని వెల్లడించారు. నేడు అనేక మంది లా స్కూల్ నుండి నేరుగా జడ్జీలుగా ఎంపికవుతున్నారని, దీని వల్ల వారికి కోర్టు ప్రొసీజర్ మీద అవగాహన తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులను లా స్కూల్లో చదివే సమయంలోనే ఒక సీనియర్ లాయర్‌తో అటాచ్ చేసి వారు ప్రాక్టికల్ నాలెడ్జి వచ్చేలా తోడ్పడాలని విశ్వవిద్యాలయ ఉపకులపతికి సూచించారు. వర్సిటీ ఉపకులపతి ఆచార్య డి.సూర్య ప్రకాశరావు మాట్లాడుతూ నేడు న్యాయవిద్యలో అనేక స్పెషలైజేషన్స్ వచ్చాయని, దీని వల్ల అవకాశాలు కూడా ఎక్కువగానే వస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ నందిని.సిపి, అకాడమిక్ డీన్ సోమా భట్టాచార్య, నూతన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జస్టిస్ మన్మథరావు

ఎమ్మెల్యే రాజును సత్కరిస్తున్న ప్రెస్ క్లబ్ ప్రతినిధులు

ఎమ్మెల్యే రాజుకు ప్రెస్‌క్లబ్ ప్రతినిధుల సన్మానం

ప్రజాశక్తి-చోడవరం రూరల్

చోడవరం ఎమ్మెల్యేగా విజయం సాధించిన కెఎస్ఎన్ఎస్.రాజును ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ చోడవరం ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ జర్నలిస్టులను గత ప్రభుత్వం మభ్యపెట్టి మోసం చేసిందని, కూటమి ప్రభుత్వంలోనైనా న్యాయం చేయాలని కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే రాజు జర్నలిస్టుల సంక్షేమం విషయంలో చంద్రబాబు న్యాయం చేస్తారని చెప్పారు. చోడవరంలో అర్హులైన జర్నలిస్టులకు సంక్షేమం విషయంలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చోడవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వంటాకు జగదీష్ బాబు, ఉపాధ్యక్షుడు ద్వారాపురెడ్డి శ్రీనివాస్, సెక్రెటరీ శ్రీనివాస్, అనంత్, సంతోష్, మూర్తి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రుణాలు అందజేస్తున్న హెరిటేజ్ మేనేజర్ శేషు

హెరిటేజ్ పాడి రైతులకు రుణాల పంపిణీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండలంలోని దుప్పుతూరు గ్రామానికి చెందిన హెరిటేజ్ డెయిరీకి పాలు పోస్తున్న రైతులకు శనివారం హెరిటేజ్ డెయిరీ మేనేజరు కూండ్రపు శేషు చేతులు మీదుగా రూ.10 లక్షల రుణాలు పంపిణీ చేశారు. 35 మంది పాడి రైతులకు బోనస్ అందజేశారు. హెరిటేజ్ డెయిరీ ద్వారా పాడి రైతులకు పాడి పశువులకు చేపట్టిన పలు సంక్షేమ కార్యక్రమాలను ఆయన వివరించారు. హెరిటేజ్ డెయిరీలో అధిక పాల ధర ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాడి రైతులు దూది నానాజీ, శెట్టి శంకర్రావు, శెట్టి కాసుబాబు, శెట్టి చిన్నకాసు బాబు, శెట్టి రాంబాబు, శెట్టి శ్రీను, శెట్టి సూరిబాబు, శెట్టి చిన్న రాంబాబు, శెట్టి ఈశ్వరరావు, శెట్టి ఆది శంకరరావు, దేశం శెట్టి కాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లభాష మాస్టరింగ్‌పై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

కార్యక్రమంలో పాల్గొన్న ఫ్యాకల్టీ సభ్యులు

ప్రజాశక్తి-అనకాపల్లి

దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీకి చెందిన బేసిక్ సైన్సెస్, హ్యూమానిటీస్ విభాగం సమగ్ర ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ శనివారం నిర్వహించారు. ఫ్యాకల్టీ సభ్యులలో ఆంగ్ల భాషా నైపుణ్యాలను మెరుగుపరచడానికి డిజిటల్ టూల్స్ మాస్టరింగ్‌పై, అధ్యాపకులను సరికొత్త డిజిటల్ సాధనాలు, వ్యూహాలతో సన్నద్ధం చేయడానికి ఈ పరివర్తన కార్యక్రమం రూపొందించినట్లు రిసోర్స్ పర్సన్ ఇంటర్నేషనల్ ఈఎస్ఎల్ ట్రైనర్ డాక్టర్ కెజీటీ సంతోష్ కుమారి తెలిపారు. సెషన్ అధ్యాపకులకు వారి బోధనా పద్ధతుల్లో సజావుగా అనుసంధానించబడే వివిధ డిజిటల్ సాధనాలు, ప్లాట్‌ఫారమ్‌లను పరిచయం చేస్తున్నామన్నారు. ఇంటరాక్టివ్, ఆకర్షణీయమైన ఆంగ్ల భాషా అభ్యాసం కోసం డిజిటల్ సాధనాలను ప్రభావితం చేసే వినూత్న బోధనా వ్యూహాలను అన్వేషించడానికి ఈ సెషన్ అధ్యాపకులకు సహాయపడినట్లు పేర్కొన్నారు. డైట్ చైర్మన్ దాడి రత్నాకర్ ప్రారంభ సెషన్‌లో మాట్లాడుతూ మార్పు అనివార్యమని, మారుతున్న పోకడలకు తమను తాము స్వీకరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు మాట్లాడుతూ తమను తాము అన్వేషించడానికి సిగ్గుపడే వారందరికీ డిజిటల్ సాధనాలు ఉపయోగపడతాయని తెలియజేశారు. బేసిక్ సైన్సెస్ అండ్ హ్యుమానిటీస్ హెచ్ఒడి డాక్టర్ పవిత్ర, కెరీర్ గైడెన్స్ కోఆర్డినేటర్ వల్లా వెంకట మురళి, ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పంచకర్లకు పుష్పగుచ్ఛం ఇస్తున్న లా వర్సిటీ వీసీ

ఎమ్మెల్యే పంచకర్లను కలిసిన లా వర్సిటీ వీసీ

ప్రజాశక్తి-సబ్బవరం

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబును మండలంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన లా వర్సిటీ సమస్యలను పంచకర్లకు వివరించారు. లా వర్సిటీలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభమైనట్లు తెలిపారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

రెండో రోజుకు రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-అనకాపల్లి

కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న వ్యసన విముక్తి కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందికి 12 నెలలుగా బకాయి ఉన్న జీతాలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగాలలో ఎంతో ప్రాధాన్యత గల వ్యసన విముక్తి కేంద్రాలలో పనిచేస్తున్న సిబ్బందికి కనీసం ప్రతి నెలా జీతాలు కూడా ఇవ్వకుండా చేయించుకోవడం దారుణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లా అధికార యంత్రాంగం వెంటనే స్పందించి 12 నెలల వేతనాలు విడుదల చేయాలని కోరారు. ఈ దీక్షలను ఏపీ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అనకాపల్లి జిల్లా కన్వీనర్ వీవీ శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు వి ఉమామహేశ్వరరావు సందర్శించి వారి పోరాటానికి సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణ చంద్ర, ఎస్.క్రాంతి కుమార్, బి.నాయుడు బాబు, రాజ్యలక్ష్మి, శ్రీదేవి, ఎ.మణి తదితరులు పాల్గొన్నారు.

దళిత మహిళను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : కర్నూలు జిల్లా ఆదోని మండలంలో భూ వివాదం నేపథ్యంలో దళిత మహిళపై ట్రాక్టర్ ఎక్కించి ఆమెను దారుణంగా హత్య చేసిన పెత్తందారులను కఠినంగా శిక్షించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆదోని మండలం నాగనాథహళ్లి గ్రామానికి చెందిన దళిత మహిళ మాల గుండమ్మ అదే గ్రామానికి చెందిన రాఘవేంద్రరెడ్డి పినతల్లి తిరుపతమ్మ వద్ద కొంతకాలం క్రితం నాలుగు ఎకరాల పొలాన్ని కొనుగోలు చేయగా, ఆ పొలంలో తనకు కూడా వాటా ఉందని రాఘవేంద్రరెడ్డి కోర్టులో కేసు వేశారని తెలిపారు. భూ వివాదం కోర్టు పరిధిలో ఉండగానే పొలం దున్నేందుకు రాఘవేంద్రరెడ్డి, ఆయన కుమారుడు శ్రీధర్ రెడ్డి, మరో నలుగురు వ్యక్తులు ట్రాక్టర్‌తో దుక్కు దున్నడానికి పొలానికి వెళ్లారని, వారిని గుండమ్మ అడ్డుకోనే ప్రయత్నం చేయగా, కొద్ది సేపు వాగ్వాదం చేసి, పొలం దున్నడానికి తీసుకొచ్చిన ట్రాక్టర్‌ను గుండమ్మ పైకి ఎక్కించి చంపేశారని తెలిపారు. ఆమెకు తోడుగా వెళ్లిన పురుషోత్తంరెడ్డి అనే వ్యక్తిపైనా రాఘవేంద్రరెడ్డి, శ్రీధర్‌రెడ్డి అనుచరులు దాడి చేసి గాయపరిచారని పేర్కొన్నారు. ఇటువంటి మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని వెంకన్న డిమాండ్ చేశారు.

పశుగ్రాసంపై అవగాహన

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మేలైన పశు సంపద ఉత్పత్తికి పోషక విలువలతో కూడిన పశుగ్రాసంతోనే సాధ్యమని చోడవరం పశు సంవర్ధక శాఖ ఏడి డాక్టర్ చిట్టిబాబు తెలిపారు. శుక్రవారం మండలంలోని బుచ్చయ్య పేట గ్రామంలో రైతులకు పోషక విలువల గల పశుగ్రాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు అధిక పాల దిగుబడుల కోసం పశు దానాలపై ఆధారపడుతున్నారని, ఇది రైతులకు అధికంగా నష్టం చేస్తుందని చెప్పారు. పశు దాన వినియోగం తగ్గించి మేలైన పశుగ్రాసం పశువులకు పెడితే అధిక పాలదిగుబడి సాధించవచ్చని తెలిపారు. అధిక దిగుబడికి అలుసంద, పిల్లిపెసర, కాకిజొన్న వంటి గడ్డిని వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఉమామహేశ్వరరావు, వెటర్నరీ అసిస్టెంట్ పి.నాగేశ్వరరావు, విశాఖ డెయిరీ కార్యదర్శి పాచిల మణి, రైతులు పుడి రామారావు, సానపతి చిన్న పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

'తల్లికి వందనం' అమల్లో మోసం

ప్రజాశక్తి-చోడవరం : తల్లికి వందనం పథకం పేరుతో చంద్రబాబు ప్రభుత్వం విద్యార్థుల తల్లులను నిలువునా మోసం చేసిందని చోడవరం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ విమర్శించారు. చోడవరంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే ప్రతి ఒక్కరికి రూ.15000 చొప్పున అందిస్తామని చెప్పారని గుర్తు చేశారు. నేడు జీవో నెంబర్ 29 విడుదల చేసి పథకాన్ని నిర్వీర్యం చేయడానికి చంద్రబాబు పూనుకున్నారని ఆరోపించారు. ప్రతిపక్షాలు విమర్శించడంతో జీవోను ఆధార్‌కు అనుసంధానం చేయడానికి విడుదల చేశామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు అందిస్తామని వాగ్దానాలు చేసిన కూటమి ప్రభుత్వం ఆ పథకాలను ఏయే తేదీల్లో ప్రజలకు అందిస్తారో వైసిపి ప్రభుత్వం మాదిరిగా క్యాలెండర్‌ను విడుదల చేయగలరా? అని సవాల్ విసిరారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై అక్రమ కేసులు బనాయించడం సరికాదన్నారు.

రైవాడ నీటి కోసం ఎదురుచూపులు..

- దశాబ్దాలు గడిచినా రైతులకు అందని సాగునీరు
- గాలిలో కలిసిన ప్రభుత్వాధినేతల మాటలు

ప్రజాశక్తి-కె.కోటపాడు

రైవాడ జలాశయం నీటి కోసం మండలంలోని పలు గ్రామాల రైతులు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నారు. రైవాడ జలాశయం నీటిని మండలంలోని అన్ని గ్రామాలకు అందించాలని ఈ ప్రాంత రైతులు ఎప్పటి నుండో కోరుకుంటున్నారు. రైవాడ జలాశయం నుండి విశాఖపట్నం తాగునీటి అవసరాల కోసం నిత్యం నీటిని తరలిస్తున్నారు. మరో వైపు దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల్లోని కొన్ని గ్రామాలకు విడతల వారీగా సాగునీటిని కూడా అందిస్తున్నారు. ఏలేరు రిజర్వాయర్ నుండి కాలువల ద్వారా నీటిని తరలించిన వెంటనే జిల్లాలోని పలు మండలాలకు చెందిన వివిధ గ్రామాలకు సాగునీటి సౌకర్యం కల్పిస్తామని రైవాడ కాలువ నిర్మాణ సమయంలో నాటి ప్రభుత్వాధినేతలు హామీ ఇచ్చారు. నాటి హామీ నేటికీ హామీగానే మిగిలింది.

ఏలేరు నీరు విశాఖపట్నానికి వచ్చిన వెంటనే ఈ కాలువ ద్వారా నీటిని రైతులకు అందిస్తామని హామీ ఇచ్చారు. ఏలేరు కాలువ ద్వారా విశాఖపట్నానికి నీరు వచ్చి రెండున్నర దశాబ్దాలు దాటింది. కాని ఇప్పటికీ రైవాడ నీటిని విశాఖపట్నం తరలిస్తూనే ఉన్నారు. రైవాడ నీటిని రైతులకు ఇవ్వాలని 2004కి ముందు నాటి కాంగ్రెస్ నేత, ప్రస్తుత అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఉద్యమం కూడా చేశారు. ఆ తరువాత 2004లో ఆయన ఎమ్మెల్యే, మంత్రి కూడా అయ్యారుగాని రైతులకు మాత్రం నీరు అందలేదు. పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి నీటిని తీసుకొచ్చి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్మాణం చేసి నీరు అందిస్తామని వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చెప్పారు. ఈ మేరకు సబ్బవరంలో శంకుస్థాపన కూడా చేశారు. శంకుస్థాపన జరిగిన 15 ఏళ్లు దాటినా సుజల స్రవంతి ప్రాజెక్టు పనులు ఒక అడుగు ముందుకు పడలేదు.

రైవాడ నుండి కె.కోటపాడు మండలంలోని ఎ.కోడూరు, వారాడ, మేడిచర్ల రొంగలి నాయుడు పాలెం, పైడంపేట, గొండుపాలెం, ఎ.భీమవరం తదితర గ్రామాలకు విడతల వారి సాగునీరు అందిస్తున్నారు. కానీ మండలంలోని మిగతా పోతనవలస, ఉగ్గినవలస, ఆర్‌వై.అగ్రహారం, కెజె.పురం, కొరువాడ, దీక్షితుల అగ్రహారం, గవరంపాలెం, దాలివలస, సింగన్న దొరపాలెం, కింతాడ, ఆర్లి, చంద్రయ్యపేట, కె.సంతపాలెం, సూదివలస, మర్రివలస, గొట్లాం, గుల్లేపల్లి, చౌడువాడ తదితర గ్రామాలకు నేటికీ సాగునీరు అందడం లేదు. అలాగే కె.కోటపాడు మండల కేంద్రానికి కూడా సాగునీరు కాదు కదా తాగునీరు కూడా అందించే పరిస్థితి లేదు. రైవాడ నుండి విశాఖపట్నం వెళ్లే కాలువ నీటిని రైతులకు అందిస్తే పై గ్రామాలకు నేరు అందుతుంది. ఇప్పటికైనా కె కోటపాడు మండలంలోని అన్ని గ్రామాలకు రైవాడ కాలువ ద్వారా సాగు తాగునీరు అందించాలని ఈ ప్రాంత రైతులు కోరుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలి.

రైవాడ రిజర్వాయర్ నుండి విశాఖపట్నం నీరు వెళ్తున్న కాలువ

పంపిణీ చేసిన నోట్ పుస్తకాలతో విద్యార్థులు

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి -అచ్యుతాపురం

అచ్యుతాపురం వికలాంగుల ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు జాతీయ అవార్డు గ్రహీత పిఎస్ పట్నాయక్ సమకూర్చిన 600 నోట్ పుస్తకాలను పరిశ్రమ మానవ వనరుల ప్రతినిధి వెంకట్ చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ పిఎస్ పట్నాయక్ సేవలు సమాజానికి ఆదర్శనీయమన్నారు. వికలాంగుల సమస్యలను పరిష్కరించడంలో సమాజంలో చాలా కీలకమైన పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు.

శ్రీనివాసరావును పరామర్శిస్తున్న నాగజగదీష్

శ్రీనివాసరావుకు నాగజగదీష్ పరామర్శ

ప్రజాశక్తి -అనకాపల్లి

తెలుగుదేశం పార్టీ క్రియాశీలక నాయకులు, 83వ వార్డు లక్ష్మీదేవిపేటకు చెందిన లక్కోజు శ్రీనివాసరావు ఇటీవల కారు ప్రమాదంలో గాయపడగా, విషయం తెలుసుకొని శాసన మండలి మాజీ సభ్యులు తెలుగుదేశం బుద్ద నాగ జగదీశ్వరరావు శనివారం శ్రీనివాసరావు స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. యోగక్షేమాలు ప్రమాద జరిగిన విధానం అడిగి తెలుసుకున్నారు. తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కర్రి గోపి, మల్ల శివనారాయణ, కాండ్రేగుల ముకుంద, కొణతాల వాసు, గొంప మహేష్, శరణం నరసింహమూర్తి, మాదేటి రాము, కొణతాల గణేష్, బర్నికాన నరసింహమూర్తి, నారాయణ, టివి రాము తదితరులు పాల్గొన్నారు.

వీర రాఘవులుకు ఘన నివాళి

ప్రజాశక్తి-చోడవరం

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, విశ్రాంత ఉపాధ్యాయులు గరిమెళ్ల వీర రాఘవులు ఇటీవల మరణించగా, శనివారం చోడవరంలో ఆయన సంస్మరణ సభ పూర్వపు విద్యార్థులు నిర్వహించారు. ఆయన దగ్గర చదువుకున్న స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు, ఇతర పూర్వ విద్యార్థులు వీర రాఘవులు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆనాడు గురువు దండించ బట్టే ఈనాడు ఆయన శిష్యులు గురుతరమైన బాధ్యత కలిగిన కొలువులో ఉన్నారని తెలిపారు. ప్రముఖ పాత్రికేయులు, రచయిత డాక్టర్ సిహెచ్.శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రమశిక్షణతో మనం ఉన్నామంటే మన గురువులు మనపై చూపిన వాత్సల్యం, ప్రేమేనని పేర్కొన్నారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు టివి.రమణ వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ఏపిటిఎఫ్ రాష్ట్ర నాయకులు బి.వెంకటపతిరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కాండ్రేగుల డేవిడ్ పాల్గొన్నారు.

వీరరాఘవులు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

మెయిన్ రోడ్డుపై వర్షపు నీరు నిల్వ

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి నుంచి తుమ్మపాల వెళ్లే మెయిన్ రోడ్డు వర్షపు నీటితో జలమయంగా మారింది. చిన్న బాబు కాలనీ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గుండాల వీధి గ్రామీణ వికాస్ బ్యాంకు తదితర ప్రాంతాల్లో రహదారి శిథిలావస్థకు చేరిన ఆ గోతుల్లో ముడుకు లోతు వర్షపునీరు నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్లో పెద్దపెద్ద గోతులు పడడంతో అందులో చేరిన నీటితో వాహనదారులు, భారీ వాహనాలు సైతం తరచూ నిలిచిపోతున్నాయి. గోతులు తెలియని వాహనదారులు వాటిలో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. చిన్న బాబు కాలనీ దగ్గర ఏర్పడిన గోతుల్లో తాత్కాలికంగా క్రషర్ బుగ్గి వేస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లోనే తిరిగి యధాస్థితికి రావడం షరా మామూలుగా మారింది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు స్పందించి ఈ రోడ్డును మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

మెయిన్ రోడ్డుపై నిల్వ ఉన్న వర్షపు నీరు

వరి నారును పరిశీలిస్తున్న కిరణ్‌కుమార్

వరి నారు రక్షణకు పలు సూచనలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో వరి నారుమళ్లను వ్యవసాయశాఖ ఏఈఓ కిరణ్ కుమార్ శనివారం పరిశీలన చేసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడకపోవడంతో కొన్నిచోట్ల వరినార్లు ఎండిపోతున్నట్లు, వాడిపోతున్నట్లు కనిపిస్తున్నాయని, రైతులు ఒక తడుపు తడుపుకుంటే నారును బతికించుకోవచ్చని చెప్పారు. జూన్ 22, 23 తేదీల్లో 11 మిల్లీ మీటర్లు, 29, 30 తేదీల్లో 17 మిల్లీ మీటర్ల వర్షం పడడంతో రైతులు వరి విత్తనాలు వేసుకున్నారని తెలిపారు. ప్రస్తుతం నారు వయసు 10 రోజుల నుంచి 15 రోజులు ఉందని, జులై 1 నుండి వర్షాలు పడకపోవడంతో కొన్ని చోట్ల నీటి వసతి లేని పొలాల్లో నారుమడులు ఎండిపోవడం, ఆకులు వడలిపోవడం కనిపిస్తున్నాయని చెప్పారు. నారును బతికించడానికి ఒక తడి ఇస్తే 10 రోజుల వరకు నారు మడిని ఆరోగ్యంగా ఉండవచ్చని పేర్కొన్నారు. నీటిలో పూర్తిగా కరిగే 19 : 19 : 19 లేదా మల్టీకే మందు (18 : 0 : 45) 5 గ్రాముల చొప్పున 1 లీటరు నీటికి (ఒక ట్యాంక్‌కు 12 నీటిలో 80 గ్రాములు మందును) నారు మడి పూర్తిగా తడిచే విధంగా కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఇలా చేయడం వల్ల వారం, పది రోజుల్లో నీటి ఎద్దడిని తట్టుకుని నారు ఆరోగ్యంగా పెరుగుతుందన్నారు.

'30 రోజుల్లోనే ప్రధాన హామీల అమలు'

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రంలో టిడిపి కూటమి ఎన్నికల్లో ఇచ్చిన మెగా డీఎస్సీ, పింఛన్లు పెంపు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, అన్నా క్యాంటీన్లు, ఉచిత ఇసుక ఐదు ప్రధాన హామీలను అమలు చేసినట్లు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగ జగదీశ్వరరావు అన్నారు. స్థానిక టిడిపి పార్లమెంట్ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 30 రోజుల్లో 30 కార్యక్రమాల నిర్దిష్టమైన ప్రణాళిక ప్రకారం అమలుకు నిర్ణయాలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న స్మగ్లింగ్, గంజాయి, డ్రగ్స్, ఎర్రచందనం లాంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆగస్టు నెలలో 183 అన్నా క్యాంటీన్లు ప్రారంభించి బడుగు బలహీన వర్గాల వారికి ఆకలి తీర్చే కార్యక్రమాన్ని నెరవేర్చుతున్నారని నాగ జగదీష్ తెలిపారు.

జిపిఎస్ గెజిట్ నోటిఫికేషన్ ప్రతుల దగ్ధం

జిఒ 54ను రద్దు చేయాలని యుటిఎఫ్ నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-చింతూరు

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల అభిప్రాయానికి భిన్నంగా గత ప్రభుత్వం గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జీపిఎస్) అమలుకు జిఒ నెంబర్ 54 గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంపై ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. జిఒ నెంబర్ 54ను రద్దు చేయాలని కోరుతూ గెజిట్ నోటిఫికేషన్ ప్రతులను యుటిఎఫ్ చింతూరు మండల కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శనివారం దగ్ధం చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పండా కృష్ణయ్య మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ విధానాలనే నేటి టిడిపి కూటమి ప్రభుత్వం కూడా కొనసాగించడం మంచి పద్ధతి కాదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టం కలిగించే గ్యారంటీ పెన్షన్ స్కీమ్ (జిపిఎస్)ను అమలు చేయడాన్ని యుటిఎఫ్ వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. దానిని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించడమే ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్ష అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి బొగ్గ ముత్తయ్య, సభ్యులు కె.భీమయ్య, కె.రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

పాడేరు : ఉద్యోగ, ఉపాధ్యాయుల అభిప్రాయానికి భిన్నంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన జి.ఓ 54 గెజిట్ నోటిఫికేషన్ పత్రాలను పాడేరు ఐటిడిఎ గేటు ముందు ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. జిఓ కాపీను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి మహేశ్వరరావు మాట్లాడుతూ, గత ప్రభుత్వ విధానాలను ఈ ప్రభుత్వం కొనసాగించడం దుర్మార్గమన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టం కలిగించే గ్యారంటీ పెన్షన్ స్కీమ్ (జిపిఎస్) ను అమలు చేయడాన్ని యుటిఎఫ్ వ్యతిరేకిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ అధ్యక్షులు నాగేశ్వరరావు, పి.దేముడు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.కన్నయ్య, మండల నాయకులు మేఘనాథ్‌లు పాల్గొన్నారు.

శిథిలావస్థలో విద్యాశాఖ కార్యాలయం

ప్రజాశక్తి-నక్కపల్లి: నక్కపల్లి మండల విద్యాశాఖ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. వర్షం వస్తే భవనం అంతా తడిసి ముద్దవుతుంది. స్లాబ్ పెచ్చులు ఊడి పడుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనన్న భయంతో శిథిల భవనాన్ని ఖాళీ చేసి ఎంఈఓ, ఉపాధ్యాయులు, సిబ్బంది కార్యకలాపాలను ప్రస్తుతానికి భవిత కేంద్రంలో నిర్వహిస్తున్నారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో గతంలో ఎంఈఓ తన కార్యకలాపాలను నిర్వహించేవారు. దీంతోపాటు కార్యాలయంలోనే ఉపాధ్యాయుల సమావేశాలు, సమీక్షలు నిర్వహించేవారు. ఒక గదిని స్టాక్ పాయింట్ కింద కేటాయించి పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసేవారు. మండల విద్యాశాఖ కార్యాలయం మూలకు చేరడంతో ప్రస్తుతానికి భవిత కేంద్రంలో ఒక గదిలో మార్చి అక్కడినుండి ఎంఈఓ, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. మరొక గదిలో భవిత కేంద్రం సేవలను నిర్వహిస్తున్నారు. శిథిలం లో ఉన్న విద్యాశాఖ కార్యాలయాన్ని తొలగించి, నూతన భవనాన్ని నిర్మించాలని కోరుతున్నారు.

శిథిలావస్థలో ఉన్న మండల విద్యాశాఖ కార్యాలయం

అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పశుగ్రాసంపై అవగాహన

ప్రజాశక్తి - చీడికాడ: మండలంలోని జైతవరం, బి సింగవరం, సింగవరం, జి.కొత్తపల్లి గ్రామాలలో పాడి రైతులకు పశుగ్రాసం ఆవశ్యకత, లాభాలపై అవగాహన కల్పించామని పశుసంవర్ధక శాఖ సహాయకులు మూర్తి శ్రీనివాసరావు, కురచా అర్జున్ మూర్తి తెలిపారు. పశుగ్రాసంతో రైతులకు పాల దిగుబడితో పాటు అధిక లాభాలు పొందవచ్చన్నారు. సీజనల్ వ్యాధుల పై అవగాహన కల్పించారు. ఈ కార్య క్రమంలో పశు వైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

ఫస్ట్ ర్యాంకర్ శ్యామ్‌కుమార్‌కు అభినందన

ప్రజాశక్తి -కోటవురట్ల: పిహెచ్‌డి ప్రవేశానికి నిర్వహించే ఎపిఆర్ సెట్‌లో మండలానికి చెందిన శ్యామ్‌కుమార్ ప్రతిభ చాటాడు. సుంకపూర్ గ్రామానికి చెందిన పోలిరెడ్డి శ్యామ్ కుమార్ మొదటి ర్యాంకు సాధించడంతో మండల వ్యాప్తంగా పలువురు వర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల జనసేన పార్టీ అధ్యక్షులు సింగంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శ్యామ్ కుమార్ మాట్లాడుతూ, వివత్తుల నిర్వహణ పరిశోధనపై దృష్టి సారిస్తానన్నారు.

అభినందిస్తున్న శ్రీనివాస్

ఆధార్ అప్‌డేట్ పేరుతో అక్రమ వసూళ్లు

ప్రజాశక్తి -అనంతగిరి: ఆధార్ కార్డు అప్డేట్ పేరుతో సచివాలయం సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు సిపిఎం నాయకులు జన్ని, భీమన జన్ని, సుబ్బారావులు తెలిపారు. స్థానిక విలేకరులతో శనివారం వారు మాట్లాడుతూ ఆధార్ అప్డేట్ కోసం రూ.200లు చెల్లించాలని లేకుంటే, లేకుంటే అవ్వదని లుంగపర్తి పంచాయతీ సచివాలయం సిబ్బంది చెపుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేసే అమ్మవడి, రైతు భరోసా ఇతర పథకాలు పొందాలంటే ఆధార్ అప్డేట్ తప్పనిసరిగా చేసుకోవాలని ప్రభుత్వం తెలపడంతో సిబ్బంది ఇదే అదునుగా ఆధార్ అప్డేట్ చేసుకోవాలని చెపుతూ ప్రతి ఒక్కరు రూ.200 చెల్లించాలని చెపుతున్నారన్నారు. సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వారు స్పష్టం చేశారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ప్రజాశక్తి-గొలుగొండ: పంచాయతీలో ప్రతి ఇంటికి తాగునీటి కొరత లేకుండా చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లుగా సర్పంచ్ గెడ్డం ఆదిలక్ష్మి ఆనంద్ అన్నారు. మండలంలో పాత మల్లంపేట శివారు కొత్తపాలెం గ్రామంలో జల జీవన మిషన్ నిధులతో బోర్ వెల్ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పాత మల్లంపేట పంచాయతీలో ఇంటింటికి కొళాయిలు ఏర్పాటు కోసం జల జీవన్ మిషన్ నిధులను 13.50 లక్షల రూపాయలు ప్రభుత్వ మంజూరు చేసిందన్నారు. ఈ పనుల్లో భాగంగా ఇప్పటికే బుడ్డడపాడు, పోలవరంలో బోర్ వెల్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. శనివారం కొత్తపాలెం గ్రామంలో ప్రారంభించమన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల నాయకులు గెడ్డం ఆనంద్, వార్డ్ నెంబర్ అడ్డూరి బంగారమ్మ, గ్రామ పెద్దలు రుత్తల సత్యనారాయణ, అల్లు సత్యనారాయణ పాల్గొన్నారు.

పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

15న బస్ పాస్‌లకు ప్రత్యేక శిబిరం

ప్రజాశక్తి-కొత్తకోట: విభిన్న ప్రతిభావంత విద్యార్థులకు ఉచిత బస్ పాస్‌కు ఈనెల 15 తేదీ సోమవారం మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు మేడివాడ హైస్కూల్ ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మీ నాయుడు, భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయుడు జగన్నాథ నాయుడులు తెలిపారు. ఈ సందర్భంగా వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ, బస్ పాసులు అందజేయడానికి అనకాపల్లి ఆర్టీసీ డిపో అధికారులు ఈనెల 15న సోమవారం ఉదయం 9 గంటల నుంచి మేడివాడ జిల్లా ఉన్నత పాఠశాలలో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తారన్నారు. బస్ పాసులు కావలసిన వారు సదరం సర్టిఫి కేట్, యు.డి.ఐ.డి కార్డు జెరాక్స్, ఆధార్ కార్డు జెరాక్స్, రేషన్ కార్డు, రెండు ఫోటోలు, 100రూపాయలు తీసుకు రావాలన్నారు. ఈ బస్సు పాసు మూడేళ్ల పాటు పనిచేస్తుందని, సిటీలో ఉచితంగా, గ్రామీణ ప్రాంతాలలో 50 శాతం రాయితీతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించ వచ్చునన్నారు.

మాట్లాడుతున్న మహాలక్ష్మినాయుడు

ఎఎంఎఎల్ కాలేజీలో డైనింగ్ హాలు ప్రారంభం

ప్రజాశక్తి -అనకాపల్లి: అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాల పూర్వ విద్యార్థుల విరాళాలు ఆరు లక్షలతో నిర్మించిన భోజనశాలను శనివారం రాష్ట్ర ఔషధ నియంత్రణ విభాగం విశ్రాంత సహాయ సంచాలకులు కాండ్రేగుల సూర్యనారాయణ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ఎంత సేవ చేసినా తక్కువే అవుతుందన్నారు. దేశ విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న పూర్వవిద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కళాశాల కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఎటువంటి లాభాపేక్ష లేకుండా కోట్లాది రూపాయల ఖర్చుతో వర్తక సంఘం విద్యాభివృద్ధికి, వైద్యాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డేడ అప్పారావు, పెనుమత్స కష్ణంరాజు, పాలకవర్గ సభ్యులు వాసిరెడ్డి బాలకష్ణ, కొణతాల రాజేంద్ర, గుర్రం ప్రసాద్, ప్రిన్సిపాల్ జయబాబు, సూపరింటెండెంట్ అనూరాధ, బిఎస్ఎంకె జోగినాయుడు, బుద్ధ కాశీ, కెవిన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న విశ్రాంత సహాయ సంచాలకులు

అందజేస్తున్న జనసేన నాయకులు

బాధితురాలికి సరుకులు, నగదు అందజేత

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని రాజయ్యపేటలో శనివారం పూరిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన పిక్కి పాపయ్యమ్మ ఇంటిలో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. దీంతో గ్యాస్ సిలిండర్ లీకై మంటలు వ్యాపించడంతో రూ.10 వేల నగదు, 2 తులాల బంగారం, బట్టలు, ఇంట్లో ఉన్న సామాగ్రి కాలి బూడిద అయినట్లు బాధితులు వాపోయారు. ఈ మేరకు జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివ దత్ సూచనలు మేరకు జనసేన పార్టీ నాయకుల ఆధ్వర్యంలో బాధితురాలుకు నిత్యావసర సరుకులు, రూ.5 వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పిక్కి స్వామి, కురందాసు అప్పలరాజు, బత్తిన గోవిందు, బంగారి రాజు, కోళ్ల గోవిందు, పిక్కి తాతాజీ, పొన్నాడ భూలోక్, బొంది తాతారావు, ఏరిపల్లి మహేష్, వంశీ, దైలపల్లి కాశీ పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

లయన్స్ క్లబ్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం నర్సీపట్నంలోని ఎలైట్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. క్లబ్ నూతన అధ్యక్షుడిగా జీ.శ్రీనివాసరావు, సెక్రటరీగా ఎస్.చైతన్య, ట్రెజరర్‌గా పి.వినోద్, ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ సాధిమా, సెకండ్ వైస్ ప్రెసిడెంట్‌గా నాగజ్యోతి, థర్డ్ వైస్ ప్రెసిడెంట్‌గా నరేష్, జాయింట్ సెక్రెటరీగా ఎన్.సుధీర్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. లయన్స్ డాక్టర్ రాఘవేంద్రరావు గోపాల్ రావు నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయించారు. గత సంవత్సరం పిఎస్‌టిలుగా పని చేసిన వారిని నూతన కార్యవర్గం సత్కరించడం జరిగింది. అనంతరం పట్టణంలోని పేద వృద్ధురాలికి వీల్ చైర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో చింతకాయల సన్యాసిపాత్రుడు, డాక్టర్ రామకృష్ణ, లయన్స్ క్లబ్, నవ్యమెంబర్స్ పాల్గొన్నారు.

సన్మానిస్తున్న మహిళలు

ఎమ్మెల్యే మత్స్యలింగంకు సన్మానం

ప్రజాశక్తి-పెదబయలు: గెలిచిన అనంతరం ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తొలిసారి రావడంతో వైసిపి మండల పార్టీ అధ్యక్షులు వంతల ఆనందరావు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక మార్కెట్ షెడ్డులో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ ఎమ్మెల్యే మాట్లాడుతూ, తనను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధికారంలో లేనప్పటికి ప్రజా సమస్యలను తన దృష్టికి తీసుకు వస్తే తక్షణమే స్పందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, జడ్పీటీసీ బొంజుబాబు, మాజీ ఎంపీపీ జర్సింగి బాలం నాయుడు, వైస్ ఎంపీపీ కొర్ర రాజుబాబు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న నిర్వాహకులు

మెనూ ఛార్జీలు పెంచాలి

-మధ్యాహ్న భోజన నిర్వాహకులు

ప్రజాశక్తి-గొలుగొండ:పాఠశాలలో అమలు జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకం మెనూ చార్జీలు పెంచాలని మధ్యాహ్న భోజన పథక జిల్లా అధ్యక్షురాలు కే.ప్రసన్న డిమాండ్ చేశారు. శనివారం మండలం మధ్యాహ్న భోజనం పథకం కార్మిక సంఘం సమావేశం గొలుగొండ మండల కేంద్రంలో ఆమె అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులకు ప్రభుత్వం ఇస్తున్న మెనూ చార్జీలు పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా పెంచాలన్నారు. ప్రభుత్వ మెనూకు, ఇస్తున్న చార్జీలకు పొంతన లేదన్నారు. అవసరమైన గ్యాస్ ప్రభుత్వమే పంపిణీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా ట్రెజరర్ కెవి సూర్యప్రభ మాట్లాడుతూ, మధ్యాహ్న భోజనం పథకం వచ్చి అనేక సంవత్సరాలు కావస్తున్నా నేటికీ కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించ లేదన్నారు. పెన్షన్, పీఎఫ్, ఇఎస్ఐ అమలు కాలేదన్నారు. కార్మికులకు రాజకీయాలు ముడిపెట్టి ఆక్రమంగా తొలగిస్తున్నారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, పలు గ్రామాల నిర్వాహకులు పాల్గొన్నారు.

గుమ్మగుడలో వైద్యశిబిరం

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:మండలంలోని అరమ పంచాయతీ గుమ్మగుడలో స్థానిక పీహెచ్‌సి సిబ్బంది వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆ గ్రామానికి చెందిన పాంగి రాజ్ కుమార్ అనే గిరిజన యువకుడు జ్వరంతో బాధపడుతూ గురువారం రాత్రి మృతి చెందారు .ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఆ గ్రామంలో శనివారం సందర్శించిన వైద్య సిబ్బంది ఇంటింటికెళ్లి వైద్య పరీక్షలను నిర్వహించారు.

చీడికాడ పిహెచ్‌సి

వైద్య సిబ్బంది విధులకు డుమ్మా

-రోగులకు తప్పని అవస్థలు - పలుమార్లు పత్రికల్లో కథనాలు వచ్చినా వీడని నిర్లక్ష్యం

ప్రజాశక్తి - చీడికాడ:స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది విధులపై నిర్లక్ష్యం వహిస్తున్నారని రోగులు ఆరోపించారు. వైద్య సిబ్బంది విధులకు డుమ్మా కొట్టడమే కాకుండా కొంతమంది సిబ్బంది విధులకు హాజరై హాజరు వేసుకొని బయటకు వెళ్లి మరల తమకు ఇష్టం వచ్చినప్పుడు వస్తున్నారని రోగులు తెలిపారు. రోగులు విలేకర్లకు తమ గోడును వెల్లడిసుకున్నారు. చీడికాడ మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తరచూగా సిబ్బంది విధులకు డుమ్మా కొట్టడంగమనార్హం. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు మెడికల్ వైద్యాధికారులు, ఒక సిహెచ్‌ఓ, ఒక యుడిసి, ఎల్టీ, ఫార్మాసిస్టు, ముగ్గురు స్టాఫ్‌నర్సులు విధులు నిర్వహిస్తున్నారు. శనివారం విధులలో మాత్రం ఒక పిహెచ్‌ఎన్, హెచ్‌వి, ఓఎస్ ఎఫ్ఎన్ఓ మాత్రం విధుల్లో ఉండటం గమనార్హం. వైద్య సిబ్బంది లేక పోవడంతో ఆసుపత్రికి వచ్చిన రోగులు తీవ్ర అవస్థలు పడ్డారు. గ్రామాలలో ఇప్పటికే సీజనల్ డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోగులు వస్తున్నారు. శనివారం ఉదయం 10 గంటల సమయంలో ఆస్పత్రికి రోగులు వెళ్లారు. ఆసుపత్రిలో డాక్టర్ తో పాటు ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్స్ ఎవరు

లేకపోవడంతో రోగులు సుమారు రెండు గంటల పైగా వేచి చూచి చూశారు. సిబ్బంది లేకపోవడంతో విలేకరులకు సమాచారం అందించారు. దీంతో ఆసుపత్రికి 10 గంటలకు వెళ్లిన విలేకరులకు 11 గంటల 30 నిమిషాల వరకు అక్కడే ఉన్నారు. విధులలో ఉన్న ఓఎస్, పిహెచ్ఎన్, హెచ్‌విలను అడిగి వివరాలు తీసుకున్నారు. ఆ సమయంలో సుమారు పది మందిలోపు రోగులు ఆసుపత్రికి జ్వరాలతో వచ్చారు. హెచ్‌వి రోగులకు వైద్య సేవలు అందించారు. స్టాఫ్ నర్స్‌ల కోసం అడగ్గా బాత్ రూమ్ కు వెళ్లారని ఓఎస్ తెలిపారు. దీంతో విలేకరులు 11:30 వరకు వేచి ఉన్నప్పటికీ స్టాఫ్ నర్స్ జాడ కనిపించలేదు. ఈ విషయమై విలేకరులు అడిగిన ప్రశ్నలకు సిబ్బంది సమాధానం చెప్పకపోగా మౌనం దాల్చారు. రక్త పరీక్షల గది కి తాళం వేసి దర్శనమిచ్చింది. జ్వరం టెస్టుకు వచ్చిన రోగులు ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. క్షేత్రస్థాయి లో పరిశీలనకు వెళ్లాల్సిన హెచ్ వి బిపి చూడటం, ఓపి నమోదు చేయడం గమనార్హం. ఈ ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది విధులపై గతంలో అనేకమార్లు ప్రముఖ దినపత్రికల్లో కథనాలు వచ్చినా వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని రోగులు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోగులకు పూర్తి స్థాయిలో వైద్యం అందేలా చూడాలని

పిహెచ్‌సిలో వేచివున్న రోగులు

పలువురు కోరుతున్నారు.

ఈ విషయంపై సంబంధిత మెడికల్ అధికారి డాక్టర్ సునీల్ కుమార్‌ను వివరణ అడగా మెడికల్ అధికారి శ్రీనివాస్ సెలవులో ఉన్నారని, తాను కూడా సొంత పనులపై అనుమతి తీసుకున్నట్లు తెలిపారు. స్టాఫ్ నర్స్ తన అనుమతి లేకుండా 10 గంటల సమయంలో బయటకి వెళ్లడం జరిగిందని, మరల 12 గంటల 30 నిమిషాలకు విధులకు హాజరైనట్లు తనకు సమాచారం అందించారన్నారు.మెమో జారీ చేసి పూర్తి వివరాలను పై అధికారులకు అందజేస్తామన్నారు. ఇకపై రోగులకు వైద్య సేవల విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందిస్తామని ఆయన తెలిపారు.

గిరి ప్రదక్షిణకు ముందే

బిఆర్‌టిఎస్ పనులు పూర్తి చేయాలి

-జివిఎంసి ఇంజినీరింగ్ అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం
- గిరిప్రదక్షిణ ఏర్పాట్లు పరిశీలన : అధికారులకు పలు సూచనలు

ప్రజాశక్తి- సింహాచలం : ఈ నెల 20న జరగనున్న గిరి ప్రదక్షిణకు ముందే బి.ఆర్.టి.ఎస్ పనులు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ జివిఎంసి అధికారులను ఆదేశించారు. శనివారం గిరి ప్రదక్షిణ ఏర్పాట్లు పరిశీలనలో భాగంగా అడవివరం జంక్షన్ నుంచి పాత గోశాల వరకు జిల్లా కలెక్టర్ పర్యటించారు. బిఆర్‌టిఎస్ రహదారి పనులను స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 20న జరగనున్న గిరి ప్రదక్షిణ కార్యక్రమానికి లక్షల సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ఆ సమయానికి ముందుగానే మిగిలిన బి.ఆర్.టి.ఎస్ రహదారి పనులు పూర్తి కావాలన్నారు. రహదారి పనులతో పాటు అవసరమైన విద్యుత్ దీపాలను సిద్ధం చేయాలన్నారు. గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు రహదారిలో తాగునీరు, మరుగుదొడ్ల వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. రథం ఏర్పాట్లను గురించి ఈఓను అడిగి తెలుసుకున్న కలెక్టర్ తొలిపావంచ వద్ద భక్తులు కొబ్బరికాయలు కొట్టి గిరి ప్రదక్షిణలో భక్తులు పాల్గొననున్నందున, అక్కడ ఎటువంటి సమస్యలు తలెత్తకుండా గట్టి పోలీస్ బందోబస్తు, క్యూలైన్లు ఏర్పాటు చేయాలని సింహాచలం దేవస్థానం ఆలయ ఇఒ ఎస్.శ్రీనివాసమూర్తిని ఆదేశించారు. గిరిప్రదక్షిణపై మరలా సమావేశం ఏర్పాటుచేస్తామని, ఈలోగా పెండింగ్ పనులన్నీ పూర్తి కావాలన్నారు.

ఈ సందర్భంగా బిఆర్‌టిఎస్ రోడ్డులో ఇళ్లుకోల్పోయిన వారందరికీ సరైన న్యాయం జరగలేదని, టిడిఆర్ విషయంలో ఒక్కొక్కరికీ ఒక్కోలా అందజేశారని ప్రవీణ్‌చంద్ర అనే యువకుడు కలెక్టర్‌కు విన్నవించాడు. నిర్వాసితులందరికీ ఒకే విధమైన న్యాయం చేయాలని కోరారు. ఈ విషయాన్ని అధికారులు చర్చించి తగు చర్యలు చేపడతామని కలెక్టర్ భరోసానిచ్చారు పర్యటనలో సింహాచలం దేవస్థానం కార్యనిర్వహణ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్ రవికృష్ణ రాజు, చీఫ్ సిటీ ప్లానర్ సురేష్, ఎస్ఇ వినయ్ కుమార్, సింహాచలం దేవస్థానం ఇంజనీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

సూచనలు ఇస్తున్న కలెక్టర్

ఎపిఎల్ సీజన్-3 విజేత

వైజాగ్ వారియర్స్

ఫైనల్స్‌లో ఉత్తరాంధ్ర లయన్స్‌పై ఘనవిజయం

వికెట్ తీసిన ఆనందంలో క్రీడాకారులు

ప్రజాశక్తి-పిఎం పాలెం: వైజాగ్ వేదికగా ఆంధ్ర ప్రీమియర్ సీజన్ 3 విజేతగా వైజాగ్ వారియర్స్ జట్టు నిలిచింది.శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఉత్తరాంధ్రా లయన్స్ జట్టుపై 87 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఫైనల్ మ్యాచ్లో తొలత టాస్ కోల్పోయి బ్యాటింగ్‌కు దిగిన వైజాగ్ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోగా 189 పరుగుల భారీ స్కోరును చేశారు. ఓపెనర్ బ్యాటర్లు బి మనీష్ వర్మ 27 బంతుల్లో 37 పరుగులు చేసి మంచి ఆటతీరు కనబరిచి అవుటయ్యాడు.మరో ఓపెనర్ బ్యాట్స్‌మ్యాన్ అశ్విన్ హెబ్బర్ ఫైనల్స్‌లో సత్తా చూపించాడు. 56 బంతుల్లో 4సిక్స్‌లు, 8ఫోర్లతో 91 పరుగులు చేశాడు.అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ జట్టు కెప్టెన్ శ్రీకర్ భరత్ కూడా 14 బంతుల్లో 21 పరుగులు చేసి అవుటయ్యాడు. దీంతో 20 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 189 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉత్తరాంధ్రా లయన్స్ జట్టు ముందు నిలిపారు.

లక్ష్యచేధనలో విఫలమైన ఉత్తరాంధ్ర లయన్స్

భారీ లక్ష్యచేధనతో బ్యాటింగ్‌కు దిగిన ఉత్తరాంధ్ర లయన్స్ ఓపెనర్లుతోపాటు, జట్టు కెప్టెన్ పిన్నింటి తపస్వి కూడా కొద్ది పరుగులకే ఔటవ్వడంతో పరుగుల వేటకు బ్రేకులు పడ్డాయి. ఆజట్టులో సాత్విక్ ఒక్కడు తప్ప, మిగిలిన వారంతా క్యూకట్టడంతో 16.3 ఓవర్లలో కేవలం 102 పరుగులు చేసి 89 పరుగుల తేడాతో ఓటమి పాలైంది.

ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరిచిన వైజాగ్ వారియర్స్

ఫైనల్ మ్యాచ్‌లో వైజాగ్ వారియర్స్ జట్టు తొలుత బ్యాటింగ్, తర్వాత బౌలింగ్‌లోనూ రాణించి ఆల్‌రౌండ్ ప్రతిభతో టైటిల్ విజేతగా నిలిచింది. వైజాగ్ వారియర్స్ బౌలర్లు పి.మణికంఠ గంగాధర్ 3, జాగర్లపూడి రామ్ 2, కె.సుదర్శన్ 2, బి యశ్వంత్, పి పి మనోహర్ తలొక వికెట్లు తీసుకున్నారు.దీనితో ఉత్తరాంధ్రా లయన్స్ జట్టును16 ఓవర్లలో 102 పరుగులకు కట్టడి చేశారు. ఎపిఎల్ సీజన్-3 టైటిల్‌ను వైజాగ్ వారియర్స్ కైవసం చేసుకున్నారు.

అభిమానులతో కిక్కిరిసిన స్టేడియం